మహా బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం

-గ్రేటర్‌లోని 300వార్డులకు రూ. 11,460 కోట్ల బడ్జెట్
-విలీన మున్సిపాలిటీలకొరకు రూ.2,260 కోట్లు కేటాయింపు
-ప్రస్తుత పాలక వర్గానికి ఇదే చివరి మీటింగ్
-మౌలిక వసతులు, పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చామన్న మేయర్
-జిహెచ్ఎంసి సేవలన్నీ అన్‌లైన్ చేశామన్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్

హైదరాబాద్, జనవరి 31,ప్రభాతవార్త: తమ పాలకవర్గ ఐదేళ్ల పాలనా కాలంలో గ్రేటర్ హైదరాబాద్ నగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుద్ధ్య వ్యవస్థ బలోపేతానికి అధిక ప్రాధాన్యతనిచ్చామనీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. ఈమేరకు శనివారం మేయర్ అధ్యక్షతన జరిగిజిహెచ్ఎంసి 10వ ప్రత్యేక బడ్జెట్ సమావేశంలో మేయర్ బడ్జెట్ ప్రవేశ పెట్టే ముందు ప్రసంగించారు. మేయర్ గా 5 ఏండ్ల తన ప్రస్థానాన్ని గద్వాల్ విజయలక్ష్మి గుర్తు చేసుకున్నారు. మేయర్ గా అవకాశం ఇచ్చిన నగర ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తన పదవీ కాలం తోపాటు మా కార్పొరేటర్లు పదవీకాల ప్రస్థానం వచ్చే నెల ఫిబ్రవరి 10వ తేదీతో ముగియనుందన్నారు.గత ఐదు ఏండ్ల పాలన కాలం విజయవంతంగా పూర్తయ్యిందని దానికి కౌన్సిల్ సభ్యుల మార్గదర్శనం, సూచనలు, విమర్శలు కూడా తనకు బలాన్నిచ్చాయన్నారు. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, కార్పొరేటర్లు , పారిశుధ్య కార్మికులు ఎండా వానా చూడకుండా, పగలు రాత్రి తేడా లేకుండా నగర అభివృద్ధి కోసం చేసిన మీ సేవలు ఎప్పటికీ మర్చిపోలేనన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ ,రోడ్ల అభివృద్ధి, జంక్షన్ ల అభివృద్ధి ,పౌర సేవల డిజిటలైజేషన్, ప్రజారోగ్య కార్యక్రమాలు వంటి అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు.పదవి ముగిసినా, హైదరాబాద్ పట్ల నా ప్రే మ, నా బాధ్య త, నిబద్ధతత ఎప్పటికీ తగ్గదన్నారు. .భవిష్యత్తు లో కూడా హైదరాబాద్ నగరం మరింత అభివృద్ధి చెందాలి, ప్రజలకు మరింత మెరుగైన జీవన ప్ర మాణాలు అందాలి అన్నది నా ఆకాంక్ష అని పేర్కొన్నారు.

కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి మృతికి కౌన్సిల్ సంతాపం.. చంపాపేట్ డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి అకాల మరణంపట్ల కౌన్సిల్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మేయర్ విజయలక్ష్మీతో పాటు, కాంగ్రెస్, బిఆర్ఎస్,బిజెపి,ఎంఐఎం సభ్యులు నివాళులర్పించారు. తనతో తమకున్న అనుబంధాన్ని సభ్యులు గుర్తు చేసుకున్నారు. డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ తన ఐదేళ్ల పదవి కాలంసంతృప్తి మిగిల్చిందన్నారు. ఈ అవకాశాన్ని ఇచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సహకరించిన కమిషనర్లకు ,అధికారులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ప్రజా ప్రతినిధులు అధికారులు అందరి సమిష్టి కృషి ఫలితంగానే గ్రేటర్ హైదరాబాద్ నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు పథకాలను ,విజయవంతంగా అమలు చేయగలిగామని తెలిపారు. కమిషనర్ల దూరదృష్టి, వేగవంతమైన నిర్ణయాలు, సమన్వయం వల్ల అనేక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని ముందుకు సాగమన్నారు.అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం కృషి చేయాలని ఆమె కోరారు.

బడ్జెట్ తయారీలో అనేక సవాళ్లు : కమిషనర్ ఆర్.వి.కర్ణన్ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ మాట్లాడుతూ..గత బడ్జెట్ తో పోల్చుకుంటే 2026-2027 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ తయారీలో అనేక సవాళ్లు ఎదురయ్యాయనీ తెలిపారు. 27 పురపాలికలు జీహెచ్ఎంసీలో విలీనం తర్వాత వాటి లయబిలిటీ, అస్సెట్‌ను లెక్కించామని చెప్పారు. ప్రాపర్టీ టాక్స్ అసెస్మెంట్, కలెక్షన్‌ను ఎండ్‌టుఎండ్ పూర్తిగా ఆన్లైన్ చేశామన్నారు. కొత్తగా విలీన పురపాలికల్లో కూడా ఆన్లైన్ ప్రక్రియను పూర్తి చేస్తామని ప్రజా అవసరాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఇలా అన్ని అంశాలను పరిగణలోనికి తీసుకుని బడ్జెట్ ను రూపొందించామని కమిషనర్ తెలిపారు.

రూ.11,460 కోట్ల బడ్జెట్ ఆమోదించిన కౌన్సిల్.. 2026-27 ఆర్థిక ఏడాది బడ్జెట్ ను కౌన్సిల్ లో జీహెచ్ఎంసీ ప్రవేశ పెట్టింది. జీహెచ్ఎంసీ మొత్తం బడ్జెట్ రూ. 11,460 కోట్లుగా పేర్కొంది. ఆదాయం రూ. 6,441 కోట్లు, జీహెచ్ఎంసీ ఖర్చు రూ. 4,057 కోట్లు, రెవెన్యూ మిగులు రూ.2,384 కోట్లు, రెవెన్యూ గ్రాంట్స్ రూ. 400 కోట్లు, కొత్తగా విలీనమైన మున్సిపాలిటీల కోసం రూ.2,260 కోట్లను కేటాయించింది. విలీనమైన 27 మున్సిపాలిటీల నుంచి వచ్చిన రెవెన్యూ రూ. 1,860 కోట్లుగా పేర్కొంది. జీహెచ్ ఎంసీ బడ్జెట్ కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

బేగంపేటలో ముగిసిన వింగ్స్ఇండియా ప్రదర్శన

-చివరి రోజు సందర్శకులతో నిండిపోయిన విమానాశ్రయం -విన్యాసాలు చూసి కేరింతలు కొట్టిన సందర్శకులు

బేగంపేట జనవరి 31,ప్రభాతవార్త బేగంపేట విమానాశ్రయంలో ఈ నెల 28న ప్రారంభమైన వింగ్స్ఇండియా 2026 ప్రదర్శన శనివారం రోజు ముగిసింది.వీకెండ్ కావడంతో జంట నగర వాసులు తమ కుటుంబసభ్యులతో తరలి రావడంతో బేగంపేట విమానాశ్రయం జన సంద్రాన్ని తలపించింది.ఎక్కడ చూసినా జనమే కనిపించారు.విమానాశ్రయానికి వచ్చే దారులన్నీ జంక్షన్లు జాం అయ్యాయి.విమానాశ్రయంలో విమానాలు కొన్ని మాత్రమే ఉన్నప్పటికీ మార్క్‌జెఫ్రీస్, సూర్య కిరణ్ టీం ఏరోబాటిక్ టీమ్ చేసిన విన్యాసాలను చూసి సందర్శకులు కేరింతలు కొట్టారు.చివరి రోజు మూడు వైమానిక ప్రదర్శనలు మాత్రమే ఉన్నప్పటికీ సందర్శకులు వాటిని చూస్తూ తమ సెల్ ఫోన్లలో బందిస్తూ చిన్నారులకు చూపిస్తూ ఎంజాయ్ చేసారు.సాధారణ సందర్శకులు పెద్ద ఎత్తున తరలి రావడంతో బేగంపేట లో వాహనాల రద్దీగా నెలకొంది.మొత్తానికి రెండేళ్ల కొకసారి పౌర విమానయాన మంత్రిత్వశాఖ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన వింగ్స్ ఇండియ 2026ప్రదర్శన ముగిసింది.ఈ ప్రదర్శనకు వచ్చిన విమానాలన్నీ బైబై చెపుతూ తరలి వెళ్లాయి.మళ్లీ రెండేళ్ల తరువాత ఈ ప్రదర్శన జరగనుంది.

ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ బస్‌భవన్‌లో అగ్నిప్రమాదం

సంఘటన స్థలంలో పరిస్థితిని తెలుసుకుంటున్న జిల్లా అగ్నిమాపక అధికారి వెంకన్న

చిక్కడపల్లి జనవరి 31 (ప్రభాతవార్త) : ఆర్టీసీ క్రాస్ రోడ్స్ బస్ భవన్ లో శనివారం సాయంత్రం సెల్లార్‌లో అకస్మాత్తుగా అగ్నిప్రమాదం సంభవించింది. వెంటనే సమాచారం అందుకున్న జిల్లా అగ్నిమాపక అధికారి వెంకన్న సంఘటన స్థలానికి చేరుకొని ముషీరాబాద్ ఎంపీటీ , గాంధీ ఫైర్ అవుట్ పోస్ట్ వాటర్ బ్రౌజర్ , సెక్రటేరియట్ ఎంపీటీ , గౌలిగూడ అగ్నిమాపక దళం సకాలంలో స్పందించి మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. విద్యుత్ వైరింగ్‌లో ఏర్పడిన షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది.ప్రస్తుతం సెల్లార్‌లో దట్టమైన పొగ ఉండటంతో, స్మోక్ ఎగ్జాస్టర్ సహాయంతో పొగను బయటకు పంపిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు అవ్వలేదని, ప్రాణనష్టం జరగలేదని అధికారులు ధృవీకరించారు. భవనంలోని ఉద్యోగులందరినీ సురక్షితంగా బయటకు తరలించారు. ఎక్కువగా ఆస్తినష్టం జరగకుండా చూశారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్ సమీపంలో ఉన్న బస్ భవన్‌లో మంటలు చెలరేగాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం, కార్యాలయంలోని విద్యుత్ వైరింగ్‌లో ఏర్పడిన షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

అంతర్జాతీయ జీబ్రా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్ జూపార్క్ లో జీబ్రాలకు విలాసవంతమైన విందు అధికారులు ఏర్పాటు చేశారు. సుమారు 5 కిలోల బరువున్న ఉడికించిన బియ్యం, కూరగాయలు మరియు పండ్లతో తయారు చేసిన ప్రత్యేక కేక్‌ను వడ్డించారు

వాష్ రూమ్‌లోని మహిళలు వీడియోలో తీస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

అల్వాల్, జనవరి 31 ప్రభాతవార్త: మహిళలు వాష్ రూమ్‌లోకి వెళ్ళిన తరువాత వీడియోలు తీస్తున్న హోటల్ కార్మికుడిపై అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేశారు. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఓల్డ్‌అల్వాల్ లయోలా కళాశాల ప్రధాన రహదారిపై ఆర్ఎస్ ఫ్యామిలీ దాబా ఉంది. శుక్రవారం రాత్రి శేఖర్ గాదేకర్ దాబాకు వెళ్ళాడు. వాష్ రూము అవసరం రావడంతో అతను అక్కడికి వెళ్ళడం జరిగింది. ఇదే వాష్ రూములోని కబోర్డు ఎక్కి ఓ వ్యక్తి మోబూల్ ద్వారా పక్కనే ఉన్న మహిళల వాష్ రూము వీడియో తీస్తుండడాన్ని గమనించాడు. తక్షణం అతనిని పట్టుకుని యాజమానికి ఫిర్యాదు చేయడంతో పాటుగా పోలీసులకు సమాచారం ఇచ్చాడు. నిందితుడు సునీల్ కుమార్ దాష్(20)ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతను దాబాలో తందూరి రోటీ మాస్టర్‌గా పని చేస్తున్నాడు. సునీల్ మొబైల్‌ను పరిశీలించగా గత కొంత కాలంగా వాష్ రూముకు వెళుతున్న మహిళల వీడియోలు, ఫొటోలు తీస్తున్నట్లు స్పష్టమైంది. పదులు సంఖ్యలో అతని మోబైల్‌లో మహిళలకు సంబంధించిన వీడియోలు ఉన్నాయి. నిందితునిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మైసూర్ బోండా గొంతులో ఇరుక్కొని వ్యక్తి మృతి

జూబ్లీహిల్స్, జనవరి 31, ప్రభాతవార్తః మైసూర్ బోండా గొంతులో ఇరుక్కొని ఒక వ్యక్తి మృతిచెందిన సంఘటన మధురానగర్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే.. రహ్మత్‌నగర్‌లోని ఎస్పీఆర్‌హిల్స్‌కు చెందిన దాసరి రమేష్(45) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత 1 గంట సమయంలో యూసుఫ్‌గూడ శ్రీకృష్ణదేవరాయనగర్ సమీపంలోని ఒక టిఫిన్ సెంటర్ వద్ద బోండాలు తినడానికి వచ్చాడు. మైసూర్ బోండాలు తింటున్న క్రమంలో ఒక్కసారిగా అతను కుప్పకూలి అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కాగా శవపంచానామాలో భాగంగా గొంతులో తినే ఆహారపదార్థం ఇరుక్కొని అతడు మృతిచెందినట్లు ప్రాథమికంగా వైద్యులు నివేదికను అందించారు. కాగా అనారోగ్యంతో మృతిచెందనిట్లు పోలీసులు ప్రాథమికంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పనిమనిషిపై దాడి... డ్రైవర్‌పై కేసు నమోదు

జూబ్లీహిల్స్, జనవరి 31, ప్రభాతవార్తః ఒక ఇంట్లో పనిచేసే పనిమనిషిపై అదే ఇంట్లో డ్రైవర్‌గా పనిచేస్తున్న వ్యక్తి దాడికి యత్నించిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నెం.34లోని ఒక ఇంటిలో గత మూడు సంవత్సరాలుగా ఒక గృహిణి(35) పనిచేస్తుంది. అదే ఇంట్లో గత ఆరు నెలలుగా డ్రైవర్‌గా పనిచేస్తున్న షబాద్ అలీ తెల్లవారుజామున ఉదయం 4.30 గంటలకు ఇంటి తలుపు ఆమె ఇంటి తలుపు తట్టాడు. పాలు వేసే వ్యక్తి వచ్చాడని భావించి తలుపు తెరవగా, షబాద్ అలీ బలవంతంగా ఇంట్లోకి ప్రవేశించి తలుపు మూసేశాడు. ఆమెతో అనుచితంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె తీవ్ర భయాందోళనకు గురైంది. దీంతో ఆమె ఇంటి యజమానురాలికి ఫోన్ చేసేందుకు ప్రయత్నించగా మొబైల్ ఫోన్ లాక్కొని నేలకేసి కొట్టాడు. ఆమె తప్పించుకునేందుకు ప్రయత్నించిన సమయంలో ఆమె ఎడమ చేతిని పట్టుకుని గోడకు నెట్టాడు. చివరకు తలుపు తెరిచి ఆమె బయటకు పరుగెత్తడంతో డ్రైవర్ సైతం అక్కడి నుంచి నెమ్మదిగా జారుకున్నాడు. జరిగిన ఘటనపై ఆమె జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమో దు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

హైదరాబాద్ వార్త

సిటీలో పెరుగుతున్న గన్‌కల్చర్

-బీహార్,యూపి నుంచి అక్రమంగా తుపాకులు -అంతర్‌రాష్ట్ర గ్యాంగుల వద్ద రూ.20నుంచి 30వేలకే అమ్మకాలు
-పోలీసుల తనిఖీలు లేకపోవడంతో ఆయుధాలు దుర్వినియోగం

హైదరాబాద్, జనవరి 31,ప్రభాతవార్త: గ్రేటంలో గన్ కల్చర్ పెరిగిపోతోంది. లైసెన్స్ గన్స్ కన్నా అక్రమ తుపాకులే ఎక్కువగా హల్చల్ చేస్తున్నాయి. ప్రాణహాని ఉన్న వ్యక్తులే కాకుండా చోటామోటా లీడర్లు, రౌడీషీటర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల వద్ద ఉన్న తుపాకులు సామాన్యులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఆత్మరక్షణ కోసం వాడాల్సిన ఆయుధాలను ఇప్పుడు స్టేటస్ సింబల్‌గా ఉపయోగిస్తున్నారు. అలాగే బెదిరింపులు, ల్యాండ్ సెటిల్ మెంట్స్ లోనూ అక్రమ తుపాకులను వాడుతున్నారు. ఓ వైపు లైసెన్స్‌డ్ గన్స్, మరోవైపు కంట్రీమేడ్ రివాల్వర్స్ ఎయిర్ గన్స్ సిటిజన్ల సెక్యూరిటీని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. తాజాగా శనివారం కోఠిలో కాల్పుల కలకలం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఎస్బీఐ బ్యాంక్ వద్ద కాల్పులకు పాల్పడి డబ్బులు కొట్టేసిన దుండగులు బాదితుడి బైక్ పైనే పరార్ అయ్యారు. ఈ క్రమంలో సీసీ టీవీ కెమెరాలు పరిశీలించగా పోలీసులనే మిస్ లీడ్ చేసినట్టు తెలిసింది. దుండగులు స్కూటీని వదిలేసి కాచిగూడ రైల్వే స్టేషన్ లోకి వెళ్లినట్టు నటించారు. కానీ రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ డీమార్ట్ వద్ద దుస్తులు మార్చుకుని, క్యాప్ పెట్టుకుని కొత్తవేషాధారణలో పరార్ అయ్యారు. సీసీ కెమెరాల ద్వారా నిందితులు ఏ రూట్ లో వెళ్లారు అనేదానిపై పోలీసులు ఐదు బృందాలుగా ఆరా తీస్తున్నాయి. పందలాది సీసీ కెమెరాలను పరిశీలిస్తూ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే తెల్లవారుజామున నగరంలో తుపాకి కాల్పులు జరగటం కలకలం రేపుతోంది. ఇటీవల కాలంలో ఇలాంటి ఘటనలు హైదరాబాద్ లో తరచూ జరగటం ఆందోళన కలిగిస్తోంది. దీంతో గన్ కల్చర్ పెరిగిపోయిందని విమర్శలు వస్తున్నాయి.

ఆయుధాలు గుర్తించడంలో పోలీసులకు సవాళ్లు.. అక్రమ ఆయుధాలను గుర్తించడంలో పోలీసులకు సవాళ్లు ఎదురవుతున్నాయి. అనుమతులు పొందిన వాటి కంటే ఎలాంటి లైసెన్స్ లేని తుపాకుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు పోలీసు అధికారులు అంచనా వేస్తున్నారు. గన్ లైసెన్స్ ఉన్న కొంత మంది రూల్స్ కు విరుద్ధంగా యూపీ, బిహార్ నుంచి అక్రమంగా తుపాకులు కొనుగోలు చేస్తున్నారు. తమ అనుచరులు, సెక్యూరిటీ గార్డులకు సఫారీ సూట్స్, గన్ పాకెట్లు కనిపించేలా హల్చల్ చేస్తున్నారు. పెళ్లి బరాత్‌లోనూ గన్స్ తో డ్యాన్సులు చేస్తున్నారు. లైసెన్స్ ఆయుధాలతో కాల్పులు జరిపితే దొరికిపోతామనే భయంతో కొంతమంది నాటుతుపాకీలు వాడుతున్నారు. బిహార్, యూపీ, రాజస్థాన్, ఢిల్లీ, మధ్యప్రదేశ్ లాంటి అంతర్రాష్ట్ర గ్యాంగ్‌ల వద్ద వాటిని కొనుగోలు చేస్తున్నారు. డిమాండ్‌ను బట్టి రూ.20వేల నుంచి రూ.30 వేల వరకు చెల్లించి నాటు తుపాకులను కొనుగోలు చేస్తున్నారు. వాటితో బెదిరింపులకు పాల్పడినా, కాల్పులు జరిపినా పోలీసులు గుర్తించే అవకాశాలు లేవు.

3నెలలకోసారి తనిఖీ చేయాలి.. గన్ లైసెన్స్ పొందాలంటే చాలా ప్రాసెస్ ఉంటుంది. స్థానిక పోలీస్ కమిషనర్‌కానీ, జిల్లా కలెక్టర్ నుంచి గన్‌లైసెన్స్ పొందాలి. అలా పొందాలనుకునే వారు తనకు ప్రాణహాని ఉందని అవసరమైన సాక్ష్యాధారాలు అందించాలి. వాటిని సమర్పించాక స్పెషల్ బ్రాంచ్ లేదా స్థానిక ఏసిపి, డిఎస్‌పి ఆధ్వర్యంలో వెరిఫికేషన్ పూర్తిచేస్తారు. సంబంధిత అధికారులు ఇచ్చే రిపోర్టు ఆధారంగా గన్‌లైసెన్స్‌పై నిర్ణయం తీసుకుంటారు. లైసెన్స్ పొందిన వారిని స్థానిక పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రతి మూడునెలలకు ఒకసారి తనిఖీ చేయాలి. గన్‌లో బుల్లెట్ల సంఖ్య కరెక్ట్‌గా ఉందా అనే వివరాలు సమీక్షించాలి. కానీ, స్థానిక పోలీసులు ఎలాంటి తనిఖీలు చేయడం లేదనే విమర్శిలు ఉన్నాయి. దీంతో పోలీసుల అనుమతితో లైసెన్స్ పొందిన వారు కూడా గన్స్‌ను దుర్వినియోగం చేస్తున్నారు. నగరంలోని మూడు కమిషనరేట్ల పరిధిలో దాదాపు12,000లకుపైగా లైసెన్సు గన్‌లు ఉన్నాయి. వాటిలో స్పోర్ట్స్, ఎక్స్ సర్వీస్మెన్, సెక్యూరిటీ ఏజెన్సీలకు చెందినవి ఉన్నాయి. ఇవే కాకుండా ఏటా గన్ లైసెన్సులకు అప్లికేషన్ల సంఖ్య పెరుగుతూనే ఉంది. బిజినెస్‌మెన్, రాజకీయ నేతలు, సెలబ్రిటీలు సహా ప్రత్యర్థుల నుంచి ప్రాణహాని ఉన్నవారు గన్ లైసెన్స్ కోసం దరఖాస్తులు పెట్టుకుంటున్నారు. అయితే, ఇటీవల కాలంలో తుపాకులు దుర్వినియోగం అవుతుండడంతో నిబంధనలు కఠినతరం చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే లైసెన్స్ మంజూరు చేస్తున్నారు.

నేడు కేంద్ర బడ్జెట్..నిర్మలమ్మ కరుణించేనా..!

హైదరాబాద్, జనవరి 31,ప్రభాతవార్త విశ్వనగరంగా రూపుదిద్దుకుంటున్న హైదరాబాద్ నగరానికి కేంద్రం నుంచి ఎంత బడ్జెట్ రాబోతుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ మహానగరంపై కరుణ చూపతుందా లేదా అన్న అంశంపై చర్చ జరుగుతుంది. శనివారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్లో తమకెన్ని నిధులు కేటాయిస్తారోనని నగరపౌరులు ఎదురుచూస్తున్నారు. ఈనేపథ్యంలోనే నగరానికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఇప్పటికే రాష్ట్రానికి కేంద్ర నిధుల వేట కోసం ముఖ్యమంత్రి, మంత్రులు ప్రధాని మోదీతో సహా కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తి చేయడం జరిగింది.ఒఆర్ఆర్ నుండి ట్రిపుల్ఆర్ మధ్య రేడియల్ రోడ్డు, మూసి అభివృద్ధి, హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు,ఎంఎంటిఎస్ విస్తరణ,రైల్వే ప్రాజెక్టులు,కొత్త ప్రతిపాదనలు నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని, ఫ్యూచర్ సిటీకి కూడా ప్రత్యేక నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది.వరద ముంపు సమస్య పరిష్కారం కోసం కూడా తగినన్ని నిధులు అందించాల్సిందిగా కేంద్ర ఆర్థిక సంఘానికి విజ్ఞప్తి చేసింది. చారిత్రకంగానూ పలు వారసత్వ సంపదలు కలిగి ఉన్న నగరంలో వాటిని పరిరక్షించడంతో పాటు పర్యాటకపరంగానూ అభివృద్ధి చేయాల్సి ఉందని అందుకు జిహెచ్ఎంసి లో 10,500కోట్లు కేటాయించాలని ప్రతిపాదనలు పంపింది.అలాగే మెట్రో రైలు రెండో దశలో 76.4 కి.మీ మేర 5 కారిడార్లను నిర్మించతలపెట్టామని, రూ.24,269 కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తోంది. బాపూఘాట్‌ను గాంధీ సరోవర్‌గా అభివృద్ధి చేయాలనుకుంటున్నామని తెలిపింది. మూసీలోకి మురికినీరు ప్రవేశించకుండా ట్రంక్ ఇంటర్‌సెప్టర్‌ను నిర్మించనున్నామని వివరించింది.ప్రస్తుతం గ్రేటర్ జనాభా 1.40 కోట్లకు చేరిందని రాబోయే రోజుల్లో ఇది మరింత పెరగనుందని అందుకనుగుణంగా వసతుల కల్పనతో పాటు అభివృద్ధి కార్యక్రమాల అవసరాన్ని కేంద్ర మంత్రి నిర్మలమ్మ ఎంతవరకు గుర్తిస్తుందో వేచిచూడాల్సిందే.

నిర్మల సీతారామన్

ఐఐటి హైదరాబాద్ సందర్శించిన పారిశుధ్యకార్మికుల పిల్లలు

హైదాబాద్,జనవరి 31,ప్రభాతవార్త: స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ (2.0)లో భాగంగా జీహెచ్ఎంసీ శనివారం పారిశుద్ధ్య కార్మికుల పిల్లలతో ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్ ఎక్స్పోజర్ విజిట్ ప్రత్యేక కార్యక్రమంను నిర్వహించింది. గ్రేటర్ హైదరాబాద్ నగర సానిటేషన్ కార్మికుల పిల్లలకు ఉన్నత విద్యపై అవగాహన కల్పిస్తూ, భవిష్యత్తు అవకాశాలను చూపించేందుకు ఐఐటీ హైదరాబాద్‌కు పర్యటన ఏర్పాటు చేసింది. "సిటీ వీధుల నుంచి ఐఐటీ కలల దాకా" పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 180 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నగర పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికుల పిల్లలకు ఉన్నత విద్యపై నమ్మకం కల్పించడం, సామాజికఆర్థిక అడ్డంకులను అధిగమించేలా ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ పర్యటన జరిగింది. విద్యార్థులకు క్యాంపస్ జీవితం, ఇంజినీరింగ్, సైన్స్ విభాగాల పరిచయం, ఐఐటీ ప్రవేశం పై వివరాలు అందించారు. ప్రయాస్ ఆధ్వర్యంలో మోటివేషనల్ ఇంటరాక్షన్‌తో ప్రారంభమైన కార్యక్రమంలో విద్యార్థులు అకడమిక్ భవనాలు, లైబ్రరీ (నాలెడ్జ్ రిసోర్స్ సెంటర్), స్పోర్ట్స్, కల్చరల్ కాంప్లెక్స్‌ను సందర్శించారు. క్యాంపస్ మెస్‌లో భోజనం చేసి విద్యార్థులు అక్కడి వాతావరణాన్ని స్వయంగా చూసారు.రోజు చివర్లో లెక్చర్ హాల్ కాంప్లెక్స్‌లో ఐఐటీ అధ్యాపకులు, విద్యార్థులు కలిసి స్వీయ విశ్వాసం, కెరీర్ ప్లానింగ్, కష్టాలను అధిగమించే మార్గాలపై చర్చించారు. ఎల్‌బీ నగర్, హెడ్ ఆఫీస్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్, సిరిలింగంపల్లి, చార్మినార్ జోన్ల నుంచి విద్యార్థులను తీసుకురావడానికి ఆరు వాహనాలు ఏర్పాటు చేశారు. బ్రేక్ ఫాస్ట్, భోజన పర్యవేక్షణను అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఐఐటీ హైదరాబాద్ అధికారులతో కలిసి నిర్వహించారు. ప్రతి జీహెచ్ఎంసీ సర్కిల్ నుంచి ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి, నోడల్ అధికారుల సమన్వయంతో కార్యక్రమం సజావుగా సాగింది.

క్యాంపస్‌లో పర్యటిస్తున్న విద్యార్థులు

కొడుకు కోసం వెతుకుతూ.. ఆకలి, చలితో రోడ్డుపైనే తల్లి మృతి

-అనారోగ్యంతో ఉన్న కొడుకును చూసేందుకు నగరానికి రాక
-అడ్రస్ మర్చిపోయి ఆచూకీకోసం 4రోజులుగా పస్తులు..
-బండ్లగూడ వద్ద మృతదేహాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు

అత్తాపూర్ జనవరి31,ప్రభాతవార్త : అడ్రస్ చిట్టి చేతుల పట్టుకొని కొడుకు కోసం నగరానికి వచ్చి తల్లి మృతి చెందిన విషాదాకరమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఘటన సంభందించిన వివరాలను పోలీసులు వెల్లడించారు. నారాయణపేట జిల్లాకు చెందిన వడ్డె చంద్రమ్మ (65)కు తన కొడుకు వెంకటేశ్‌కు ఒంట్లో బాలేదని తెలిసింది. కన్నప్రేమ ఆగలేదు..దీంతో ఈనెల 25న పల్లె నుంచి హైదరాబాద్ బండ్లగూడలోని కొడుకు ఇంటికి బయలుదేరింది. తల్లి వస్తున్న విషయాన్ని తండ్రి రాములు కొడుకుకు ఫోన్ చేసి చెప్పాడు. కానీ, ఆ తల్లి మాత్రం కొడుకు ఇంటికి చేరలేదు. నగరానికి వచ్చిన చంద్రమ్మ కొడుకు ఇంటి దారి మర్చిపోయింది. చేతిలో ఫోన్ లేక, ఎవరిని అడగాలో తెలియక నాలుగు రోజుల పాటు బండ్లగూడ వీధుల్లోనే తిరిగింది. ఆకలి వేసినా ఎవరినీ అడగలేక, రాత్రి పూట చలిని తట్టుకోలేక చివరకు జనవరి 29న ప్రాణాలు విడిచింది. ఆమె కోసం కూతురు, కోడలు మూడు రోజుల పాటు వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం బండ్లగూడ కాళీమందిర్ సమీపంలోని ఓ పూల బండి వద్ద ఓ వృద్దురాలు పడి ఉండటాన్ని చూసి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూసేసరికి..తాము వెతుకుతున్న చంద్రమ్మ విగతజీవిగా పడి ఉంది. కొడుకును చూద్దామని వచ్చిన తల్లి,

బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌కై సమ్మక్క సారమ్మలకు మొక్కులు

సమ్మక్క సారలమ్మ దేవతలకు మొక్కులు సమర్పించుకుంటున్న బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజుగౌడ్

హైదరాబాద్, జనవరి 31 ప్రభాతవార్త

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధనకై వనదేవతులైనటువంటి సమ్మక్క సారమ్మలకు మొక్కులు చెల్లించుకున్నామని బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజుగౌడ్ తెలిపారు. శనివారం మేడారం సమ్మక్క సారమ్మలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బాలరాజుగౌడ్ మాట్లాడుతూ. గిరిజనుల ఆరాధ్య దైవమైనటువంటి సమ్మక్క సారమ్మల చల్లని దీవెనలతో బహుజనులకు రాజ్యాధికారం రావాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధన ముఖ్య లక్ష్యంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆ దిశగా బహుజనలకు శక్తిని ప్రసాదించాలని అమ్మవార్లను పూజించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ ఫ్రంట కన్వీనర్‌లు యెలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, ఎస్.దుర్గయ్యగౌడ్, అంబాల నారాయణగౌడ్, బైరు శేఖర్ గంగపుత్ర , సింగం నాగేష్ గౌడ్, బాలగొని వెంకటేష్ గౌడ్, పోతగని ఐలేన్‌గౌడ్ పాల్గొన్నారు.

పావురాలకు ఫీడింగ్ వద్దు .. గోమాతకు ఫీడింగ్ ముద్దు : బిక్షపతి యాదవ్

నిజాంపేట్, జనవరి 31, ప్రభాతవార్త

పావురాలకు ఫీడింగ్ వద్దు మన గోమాతకు ఫీడింగ్ ముద్దు అని బిక్షపతి యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ జంతు ప్రేమికులు పశుపక్షాదులపైన ప్రేమను చూపించాలి కానీ పావురాలకి ఫీడింగ్ చేయడం ద్వారా పావురాల రెక్కల ద్వారా అనేక వ్యాధులు ముఖ్యంగా క్యాన్సర్, శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయని డాక్టర్లు ఎన్నో ఆవగాహన కార్యక్రమాలు సామాజిక మాధ్యమాల ద్వారా చెప్తున్నప్పటికీ కొంతమంది వారి ప్రవర్తన తీరులో మార్పు రావడం లేదని ఆన్నారు. నిజాంపేట సర్కిల్లోని గోసాల వద్ద ప్రభుత్వ ఖాళీ స్థలం ఉంది కదా అని కొంతమంది కావాలని ఈ ఫీడింగ్ కార్యక్రమం పెడుతున్నారు దానిని చూసి కొంతమంది ప్రజలు అక్కడికి వచ్చి ఫీడింగ్ కార్యక్రమం చేపట్టడం ద్వారా చుట్టు పక్కల ఉన్న ప్రజలు అనారోగ్యానికి గురి అవుతున్నారని తెలిపారు. కుక్కను కూడా భైరవునిగా పూజించే హిందూ ప్రజలు ప్రాచాత్య సంస్కృతిలో పడి మన హిందూ సనాతన ధర్మంలో ఉన్న గోమా తను నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రతి హిందువు కూడా కుక్కలకు బదులుగా ప్రతి ఒక్కరు గోమాతను పూజించాలని అన్నారు. హెల్త్ డిపార్ట్మెంట్ కూడా పావురాలకు ఫీడింగ్ చేయొద్దని పదేపదే ఆదేశాలు జారీ చేస్తున్నారని ప్రజల ఆరోగ్య రీత్యాదీనిని నిర్మూలించాలని ఆయన కోరారు.

పదవి విరమణ తర్వాత సమాజాభివృద్ధికి పాటుపడాలి

పదవి విరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు లక్ష్మిపద్మజాకుమారిని సన్మానించిన దృశ్యం

బేగంబజార్,జనవరి 31ప్రభాతవార్త:

సమాజంలో గుర్తింపు పొందాలంటే విద్యతో సాధ్యమవుతుందని బహదూర్‌పురా మండల డిప్యూటి ఎడ్యుకేషన్ ఆఫీసర్ పొమ్యా నాయక్ అన్నారు. అఫ్జల్‌గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానా ఉపాధ్యాయులు లక్ష్మపద్మజాకుమారిపదవి విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షరం మూలంగా జ్ఞానంతో విజ్ఞానవంతులుగా మారి సమాజాభివృద్ధి కోసం పాటుపడుతారన్నారు. తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టి.ఆర్.టి.ఎఫ్)హైదరాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎస్.విజయబాస్కర్ మాట్లాడుతూ పదవి విరమణ అనేది పెద్ద విరమణ కాదనికొత్త ఉత్సాహం పెంపొందించుకోవాలన్నారు. 35 సంవత్సరాల బాల,బాలికలకు విద్యభోదనలనుచేసి సమాజానికి ఎంతో మంది విద్యావంతులను అందించిన ప్రధానా ఉపాధ్యాయురాలు లక్ష్మిపద్మజా కుమారిని హరిజన అభ్యుధయ సంఘం అధ్యక్షులు ఎంపి.సదానంద్,కార్యదర్శిఎం.ప్రభాకర్,మహిళా నాయకురాలు బేబిరాణి,సౌజన్య,బస్తీప్రతినిధులు పి.మహేందర్, రాములు,లక్ష్మయ్య,రామ్‌దాస్‌లతో,మహాత్మాజ్యోతిరావు పూలే యువమంచ్ అధ్యక్షులు గురుచరణ్, పూర్వఉపాధ్యాయులు హరి శంకర్,శివశంకర్,సుచరిత,బబిత,విజయ్‌లక్ష్మి,మోహిద్,బల్వంత్‌రెడ్డి ,ప్రధ్యుమ్నరెడినడ,జ్యోతి,శైలజ,ముక్తధర్ తదితరులు పాల్గొన్ని పూర్వ విద్యార్థులు,ఉపాధ్యాయులు రహదారి ఇరువైపులా పూలతో స్వాగతం పలికారు.సృజన్,వైష్ణవి విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఎంతోఆకట్టుకున్నాయి.

బల్కంపేట్ అమ్మవారి ఆలయం ప్రాంగణంలో అన్నదానం

సంజీవరెడ్డి నగర్, జనవరి 31, ప్రభాతవార్త:

సంజీవరెడ్డి నగర్‌లోని శ్రీ ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానం, బల్కంపేట్ అమ్మవారి ఆలయం ఎదురు ప్రాంగణంలో ముత్యాల కృష్ణ, ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతి నెల చివరి శనివారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. దాత నెల్లూరు నారాయణ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 500 మందికి అన్నప్రసాదం వితరణ చేశారు. ఈ అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి అమీర్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎం. హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరంగా అన్నదానం నిర్వహించడం గొప్ప సేవా కార్యక్రమమని ప్రశంసించారు. కార్యక్రమంలో నాయకులు పోతురాజు కుమార్, మహేష్ యాదవ్, మోహన్ పాల్గొన్నారు.

నిమ్స్‌లో పలువురు పదవీ విరమణ

పదవీ విరమణ పొందిన వారిని సత్కరిస్తున్న వైద్యులు

జూబ్లీహిల్స్, జనవరి 31, ప్రభాతవార్తః

నిమ్స్ ఆసుపత్రిలో పలువురు ఉద్యోగులు శనివారం పదవీవిరమణ చేశారు. పాత ఓపీడీ భవనం లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆసుపత్రి డీన్ ప్రొఫెసర్ లిజా రాజశేఖర్ పదవీవిరమణ పొందిన వారిని సత్కరించి వారి సేవలను కొనియాడారు. పదవీ విరమణ పొందిన వారిలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉమేష్‌కుమార్, సీనియర్ టెక్నికల్ అధికారి ఎన్. శ్రీకాంత్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ చంద్రశేఖర్, నర్సింగ్ అధికారులు పద్మజయంతి కరణం, ఫ్లోరెన్సా హెలెనా, రికార్డ్ అసిస్టెంట్ మహమ్మద్ జమీరుద్దీన్ ఉన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సాయి సతీష్, హెచ్ఆర్‌డి స్టాఫ్ ఏఎన్ జ్యోతి శైలజ, పారామెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సాధికారత సాధించిన మహిళలే తెలంగాణ ప్రగతికి పునాది : ఎమ్మెల్యే నవీన్ యాదవ్

హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త

పారిశ్రామిక, వ్యాపార రంగాల్లో పోటీపడి సాధికారత సాధించిన మహిళలే తెలంగాణ ప్రగతికి పునాదిగా నిలుస్తారని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్ అన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ప్రముఖ సౌందర్య నిపుణురాలు రమణి పెనుబాల ఏర్పాటు చేసిన ఎంఐఓఆర్ఐ అకాడమీని ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహిళలకు ఉజ్వలమైన, సమాన అవకాశాలతో కూడిన భవిష్యత్తు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రభావవంతమైన విధానాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. అకాడమీ నిర్వాహకురాలు రమణి పెనుబాలను అభినందించిన ఆయన, ఈ సంస్థ ద్వారా యువతులకు నాణ్యమైన వృత్తిపరమైన శిక్షణ అందించి ఉత్తమ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రమణి పెనుబాల మాట్లాడుతూ, చర్మ సంరక్షణ, మేకప్ అప్లికేషన్, హెయిర్

ఎంఐఓఆర్ఐ అకాడమీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, చిత్రంలో రమణి పెనుబాల తదితరులు

స్టైలింగ్, నెయిల్ కేర్, వాక్సింగ్, హెయిర్ ఫేస్ ట్రీట్మెంట్స్ వంటి విభిన్న కోర్సుల్లో అనుభవజ్ఞులైన బోధకుల పర్యవేక్షణలో ఆచరణాత్మక శిక్షణ అందిస్తామని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా యువతీయువకులు విజయవంతమైన కెరీర్ ప్రారంభించేందుకు మార్గదర్శనం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపార వృద్ధి విశ్లేషకులు వేణు కళ్యాణ్, సంఘసేవకులు భాను కిరణ్ పసుల, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధ్యరెడ్డి, టీడీపీ ప్రధాన కార్యదర్శి ఏ. విశ్వం పాల్గొన్నారు.

7వ తేదీ నుంచి యూరోనిక్స్ ఇసిసిఎల్ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు

హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త

యూరోనిక్స్ కార్పొరేట్ క్రికెట్ లీగ్ (ఇసిసిఎల్) సీజన్ 3.0 తిరిగి ప్రారంభమవుతున్నట్లు ప్రకటించింది. సంవత్సరాలుగా ఇసిసిఎల్ ఒక ప్రధాన కార్పొరేట్ క్రీడా వేదికగా రూపాంతరం చెందింది. వివిధ పరిశ్రమలకు చెందిన వ్యాపార నాయకులు, ప్రొఫెషనల్స్,జట్లు బోర్డు గదులను విడిచి క్రికెట్ మైదానంలో కలుసుకొని జట్టు సమన్వయం, నాయకత్వం,పోటీ స్ఫూర్తిని వేడుకగా జరుపుకుంటున్నారు. తొలి రెండు సీజన్ల విజయవంతమైన నిర్వహణ తర్వాత, ఇసిసిఎల్ సీజన్ 3.0 ఇప్పటివరకు జరిగిన వాటిలోనే అతిపెద్ద ఎడిషన్‌గా నిలవనుంది. ఈ టోర్నమెంట్ ఈనెల 7, 8 తేదీలలో నిర్వహించబడనుంది. మొత్తం 16 ప్రముఖ కార్పొరేట్ జట్లు పాల్గొని, 15 ఉత్కంఠభరిత మ్యాచ్‌లలో పోటీపడనున్నాయి. జెర్సీ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఇఎస్ బిల్డర్స్ అసోసియేషన్ తెలంగాణ చైర్మన్ అడేపు శ్రీనివాస్ హాజరై, క్రీడల ద్వారా నాయకత్వం,జట్టు బంధం ప్రాముఖ్యతపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా యూరోనిక్స్ ప్రతినిధి మాట్లాడుతూ యూ

యూరోనిక్స్ కార్పొరేట్ క్రికెట్ లీగ్ (ఇసిసిఎల్) జెర్సీ ఆవిష్కరిస్తున్న అడేపు శ్రీనివాస్

రోనిక్స్‌లో మేము కేవలం ఉత్పత్తులను మాత్రమే నిర్మించము ఎకోసిస్టమ్‌లను నిర్మిస్తాము. క్రీడ అనే సార్వత్రిక భాష ద్వారా భారతదేశ కార్పొరేట్ సమాజాన్ని ఒకచోట చేర్చే మా ప్రయత్నమే నిదిదిలి. సీజన్ 3 వ్యాపారానికి అతీతంగా నాయకత్వం, ఉత్తమత మరియు దీర్ఘకాలిక సంబంధాలపై మా విస్తృత దృష్టిని ప్రతిబింబిస్తుంది" అన్నారు. భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న కార్పొరేట్ హబ్‌లలో ఒకటైన హైదరాబాద్‌లో నిర్వహించబడనున్న నిదిదిలి సీజన్ 3.0, ప్రముఖ సంస్థలు ,పరిశ్రమ నిర్ణయాధికారుల పాల్గొనడంతో దేశంలోని అతిపెద్ద మరియు అత్యంత ప్రభావవంతమైన కార్పొరేట్ క్రీడా ఈవెంట్లలో ఒకటిగా నిలవనుంది.

శాంతి భద్రతల పరిరక్షణలో సిసి కెమేరాలు కీలకం : ఎసిపి గోపాలకృష్ణ మూర్తి

బేగంపేట జనవరి 31,ప్రభాతవార్త

శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని,ప్రతి ఒక్కరూ తమ కాలనీలు,వ్యాపార సముదాయాలు,నివాసాలు ఇలా ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని బేగంపేట డివిజన్ ఏసీపీ గోపాల కృష్ణమూర్తి పిలుపు నిచ్చారు.నేరాల నిరోధానికి, సాక్ష్యాధారాల సేకరణకు,నేరస్థుల గుర్తింపుకు,ప్రమాదాలు జరిగిన సమయంలో వాహనాల గుర్తింపునకు,పోలీసు దర్యాప్తులో వేగం కోసం,నిరంతర నిఘా కోసం సీసీ టీవీలు ఎంతో ముఖ్యమని ఏసీపీ అన్నారు.శనివారం బేగంపేట పరిధిలోని ఇండియన్ ఎయిర్ లైన్స్‌కాలనీలో సుమారు 5లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 32సీసీ కెమెరాలను కాలనీ ప్రతినిధులతో కల్సి ఏసీపీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మనుషులు ప్రతి చోటా ప్రతినిమిషం నిఘా ఉంచడం సాధ్యం కాదని,సీసీ కెమె

సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి.

రాలు రాత్రి,పగలు తేడా లేకుండా నిరంతరం పనిచేస్తాయన్నారు.దీని వల్ల రద్దీ తక్కువగా ఉన్న సమయాల్లో కూడా భద్రత ఉంటుందని అన్నారు.పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న మిగిలిన కాలనీల వారు కూడా ఎయిర్ లైన్స్ కాలనీ వాసులను ఆదర్శంగా తీసుకుని సీసీ టీవీలు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీధర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

15న ఎన్టీఆర్ స్టేడియంలో మహాశివరాత్రి అభిషేక ,జాగరణలు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఆహ్వానం

సైఫాబాద్, జనవరి 31 ప్రభాతవార్త: శ్రీచాముండేశ్వరి అనుగ్రహ పీఠాధిపతులు పరమపూజ్య బ్రహ్మశ్రీ శ్రీకృష్ణ చాముండేశ్వరి మహర్షి శంభో, స్వయంభో మహాశివరాత్రి జప, అభిషేక జాగారణ వేడుకలు ఫిబ్రవరి 15వ తేదీన ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్నామని శ్రీకృష్ణ చాముండేశ్వరి మహర్షి తెలిపారు. ఈ జాగారణ వేడుకలకు హాజరు కావాలని ఆయన ఈ మేరకు శనివారం నాడిక్కడ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి ఆహ్వాన ప్రతిక అందజేసి వేడుకలకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఆ రోజు దివ్య సాలగ్రామాలకు, శివలింగాలకు అభిషేకం, జపధా్యన కార్యక్రమాలు జరుగుతాయని ఆయన తెలిపారు. ప్రతి ఏడాది మహా శివరాత్రి సందర్భంగా చాముండేశ్వరి అనుగ్రహ పీఠం నిర్వహిస్తున్న జప జాగాలను అభిషేక మహోత్సవాలకు ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధలతో సాంప్రదాయ దుస్తులతో ఈ ఉత్సవంలో పాల్గొనాలని కోరారు. దేశంలోని అన్ని రాష్ట్రాల గోసంతతిని పూజా దర్శనార్థం ప్రత్యేకమైన పూజా, గోవులను

కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న చాముండేశ్వరి మహర్షి

తిలకించే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. వేలాది సాలగ్రామాలకు అఖండనది తీర్థాలతో అభిషేకాలు నిర్వహించే ఈ అద్భుతమైన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేశామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

భక్తిమార్గంలో ఆండాళ్ మధురస్వప్నం-శ్రీరంగనాథ సుప్రభాతం : డా. కె.వి.రమణాచారి

రవీంద్రభారతి, జనవరి 31 ప్రభాతవార్త : ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత్రి, గాయని టి.వి.సుందరవల్లి శ్రీదేవి ఆళ్వారుల విరచిత ఆండాళ్ మధురస్వప్నం; ప్రముఖ టిటిడి గాయకుడు పారుపల్లి శ్రీరంగనాథ్ గానం చేసిన శ్రీరంగనాథ సుప్రభాతం భక్తిమార్గంలో పయనింపజేస్తున్నాయని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి అన్నారు. యువ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో డా. బి.ఆర్.వెంకటరమణ నిర్వహణలో రెడ్‌హిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డా. కె.వి.రమణాచారి సరస్వతి సమ్మాన్ టి.వి.సుందరవల్లి శ్రీదేవి, టిటిడి గాయకుడు పారుపల్లి శ్రీరంగనాథ్ తదితరులతో కలిసి ఆండాళ్ మధురస్వప్నం పుస్తకం, శ్రీరంగనాథ సుప్రభాతం ఆడియోలను ఆవిష్కరించి మాట్లాడారు. భక్తులందరికీ పరమ పవిత్రమైన అమ్మవారి, స్వామివారి పాదాలు ఒకసారిచూసి సేవించుకున్నాక వదిలిపెట్టడానికి ఎలాగైతే మనసురాదో 30 పాశ్వాలను నేర్చుకున్నాక మరచిపోవడం జరగదని, చిన్న వయస్సులో నేర్చుకున్న పాశ్వాలు కొన్నింటిని ఉటం కించారు.అనంతరం విశిష్ట అతిథులు డా.పులిపర్తి కృష్ణ మూర్తి,హైకోర్టు న్యాయవాది వినయకుమార్‌లు మాట్లాడారు.

శ్రీరంగనాథ సుప్రభాతం, ఆండాళ్ మధురస్వప్నంలను ఆవిష్కరిస్తున్న రమణాచారి, శ్రీదేవి, శ్రీరంగనాథ్, వెంకటరమణ తదితరులు

చెరువుల పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు చర్యలు

అత్తాపూర్ జనవరి31,ప్రభాతవార్త : చెరువుల పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపడుతున్నామని అత్తాపూర్ సర్కిల్ డిసి సమ్మయ్య పేర్కొన్నారు. రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ఆదేశాల మేరకు శనివారం అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని చెరువులను డిసి సమ్మయ్య పరిశలించారు.హైదర్‌గూడలోని పెద్దతాళ్లకుంట చెరువు పార్కులో డిసి పర్యటిస్తూ పాదచారులతో మాట్లాడారు.పార్కులో చేసిన పారిశుధ్య పనులను గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.డిసి మాట్లాడుతూ..అత్తాపూర్ సర్కిల్ పరిధిలో చెరువుల పరిసరాల ను శుభ్రంగా ఉంచేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు.

సామాజిక భవన స్థలాన్ని పరిశీలించిన కార్పొరేటర్

సామాజిక భవన స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి.

జూబ్లీహిల్స్, జనవరి 31, ప్రభాతవార్తః

ఖైరతాబాద్ డివిజన్‌లోని రామకృష్ణనగర్‌లో నూతనంగా నిర్మానం చేపట్టన్న సామాజిక భవన స్థలాన్ని శనివారం ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ పి. విజయారెడ్డి సందర్శించి పరిశీలించారు. గతంలో ఇక్కడ ఉన్న సామాజిక భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానికుల కోరిక మేరకు కార్పొరేటర్ రూ. 11 లక్షల నిధులను మంజూరు చేయించారు. ఈ క్రమంలోనే ఆయా ప్రాంతాన్ని శనివారం జీహెచ్ఎంసీ డీఈ కృష్ణచైతన్య, ఏఈ భరత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌తో కలిసి పరిశీలించారు. పనులను త్వరితగతిన చేపట్టి స్థానికులకు అందుబాటులోకి తీసుకొని రావాలని సూచించారు. సామాజిక భవనం ఏర్పాటు వల్ల స్థానికులు చిన్నచిన్న కార్యక్రమాలను ఇక్కడ చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుందని ఆమె వివరించారు. కార్యక్రమంలో స్థానిక బస్తీ నేతలతోపాటు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

నెమలీనగర్‌లోని సమస్యలు పరిష్కరించాలి : బిఆర్ఎస్

నార్సింగి, జనవరి 31 ప్రభాతవార్త : మణికొండ డివిజన్ నెమలీనగర్‌లో ప్రజలు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలు పరిష్కరించాలని బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ పేర్కొన్నారు. శనివారం నెమలీనగర్‌లో బిఆర్ఎస్ బృందం పర్యటించింది. అక్కడ ఇళ్ల మధ్యలో పేరుకుపోయిన చెత్తను, నల్లచెరువు, ఫిరంగినాలాల బఫర్‌జోన్ స్థలాలను పరిశీలించారు. పాడైపోయిన క్రీడా మైదానంలో పాడైపోయిన పరికరాలతో గాయాలపాలైన పిల్లలను పరామర్శించారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ దోమల బెడద విపరీతంగా ఉందని, దోమల నిర్మూళన కోసం మందులు పిచికారి చేయాలని, చెత్తను ఏ రోజుకు ఆ రోజు ఎత్తించాలని డిమాండ్ చేశారు. ఫిరంగినాలా, నల్లచెరువుల బఫర్ జోన్‌లను కబ్జాల చెర నుంచి విడిపించి, ప్రజలకు ఉపయోగపడేలా రోడ్డును నిర్మించాలని పేర్కొన్నారు. అధికారులు ఖాళీ ప్లాట్లకు ఇంటి నెంబర్లు కేటాయించి, ఇళ్లు నిర్మించుకున్న వారికి ఆరేళ్లుగా ఇంటి నెంబర్లు ఇవ్వకపోవడం దారుణమని

పుప్పాలగూడలోని నెమలీనగర్‌లో చెత్త సమస్యను పరిశీలిస్తున్న బిఆర్ఎస్ నాయకుల దృశ్యం

మండి పడ్డారు. అధికారులు తారతమ్య భేదాలు చూపకుండా అందరికి ఇళ్ల నెంబర్లు కేటాయించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు వంశీ, సత్యనారాయణ, అశోక్, విఠల్, శ్రీనివాస్, ఆంజనేయులు, బాలయ్య, నర్సిహ్మా, ఆంజనేయులు, రామ్‌సాగర్, నరేష్‌లు, బిఆర్ఎస్ నాయకులు ధన్‌రాజ్, నరేందర్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, అందె లక్ష్మణ్‌రావ్, కిరణ్, ఆరిఫ్, సుమనళిని తదితరులు పాల్గొన్నారు.

ఎపి స్పేస్ టెక్ సమ్మిట్‌లో జెహెచ్‌పిఎస్‌కు అవార్డు

జూబ్లీహిల్స్, జనవరి 31, ప్రభాతవార్తః

ఏపీ స్పేస్‌టెక్ సమ్మిట్‌లో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ (జేహెచ్‌పీఎస్) తన ఘనతను చాటింది. ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో జరిగిన ఈ సమ్మిట్‌లో పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు మూడు ప్రాజెక్టులను ప్రదర్శించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ కాంచనవల్లి తెలిపారు. డైసన్ స్వార్మ, సౌరశక్తిని మొహరించడంపై దృష్టి సారించడం తోపాటు భారీ స్థాయిలో పునరుత్పాదక శక్తిని ఉత్పత్తి చేయడానికి, సూర్యుడి చుట్టూ ఉపగ్రహాలను సేకరించే నమూనాలను ప్రదర్శించారు. కాస్మిక్ ఈవెంట్‌ను అధ్యయనం చేయడానికి ఉపయోగించే లేజర్ ఇంటర్‌ఫెరోమీటర్ గ్రావిటేషనల్-వేవ్ అబ్జర్వేటరీ పనితీరును, ప్రాముఖ్యతను 'ది లిగో' నమూనా ద్వారా వివరించారు. ది అరిస్టోక్రాట్ ప్రాజెక్ట్ నమూనా మార్స్ మిషన్ భావనను ప్రదర్శించేలా ఏర్పాటుచేశారు. ఇది రాకెట్ ప్రయోగంతో ప్రారంభమై, ఆర్బిటర్, ల్యాండర్‌ను కలిగి ఉన్నట్లు వివరించారు. 120 జట్లు, 43 పాఠశాలలు పాల్గొన్న ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన కార్తిక్ మోతుకూరి, శివంక్ కార్తిక్ భూపాల్, ప్రద్యుమ్న మంచికంటి రూపొందించిన ది అరిస్టోక్రాట్ ప్రాజెక్ట్ మూడో స్థానాన్ని దక్కించుకున్నట్లు కాంచనవల్లి వివరించారు. ఈ నమూనాకు రూ. 7500ల నగదు బహుమానాన్ని నిర్వాహకులు అందిచారన్నారు.

పురస్కారాన్ని అందుకుంటున్న జేహెచ్‌పీఎస్ విద్యార్థులు.

త్యాగరాజు ఉత్సవాలు..

త్యాగరాజు జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని పాఠశాలలో ఆయా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. త్యాగరాజు కృతులతో విద్యార్థుల ప్రదర్శన ఇక్కడ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు మురళీముకుంద్ మాట్లాడుతూ.. శాస్త్రీయ సంగీతం వారసత్వాన్ని సజీవంగా ఉంచడానికి విద్యార్థులు చేసిన ప్రయత్నాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు త్యాగరాజు కృతులు, చిత్రపటంతో కీర్తనలు ఆలపిస్తూ పాఠశాల చుట్టుపక్కల పర్యటించారు.

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నిరసన

ఎం.జె.మార్కెట్ చౌరస్తా వద్ద నిరసనలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

అఫ్జల్‌గంజ్,జనవరి 31ప్రభాతవార్త:

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకానికి వ్యతిరేకంగా ఖైరతాబాద్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎం.జె మార్కెట్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు పాల్గొన్ని నిరసన వ్యక్తం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో ఖైరతాబాద్ కాంగ్రెస్ డి.సి.సి అధ్యక్షులు మోత రోహిత్ ముదిరాజ్ అధ్యక్షతన సత్యాగ్రహం కార్యక్రమాన్ని చేపట్టారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పనికి ఆహారం పేరు మార్పు చేయడం పట్ల తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు సునీత,మాజీకార్పొరేటర్ మమతసంతోష్‌గుప్త, పరమేశ్వరి,కాంగ్రెస్ నాయకులు ముంద్రాయి శ్రీనివాస్, నరేందర్ శెట్టి,యోగిచంద్రమోహన్‌యాదవ్,శ్రీకాంత్‌యాదవ్,బద్దం సతీష్‌గౌడ్,అశోక

హెచ్ఎం ఆశీర్వాదం సేవలు స్ఫూర్తిగా తీసుకోవాలి : ఎమ్మెల్యే

పదవీ విరమణ చేస్తున్న టీచర్స్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

కంటోన్మెంట్,జనవరి 31 ప్రభాతవార్త: ఎంతో మంది విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పి పలువురికి దర్శంగా నిలిచిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మేడా ఆశీర్వాధం శయాలను స్ఫూర్తిగా తీసుకొని తోటి ఉపాధ్యాయులు విధులు నిర్వహించాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ సూచించారు. బోయిన్‌పల్లి బాపూజీ నగర్ ప్రభుత్వపాఠశాల హెచ్ఎం ఆశీర్వాధం పదవీ విరమణ చేస్తున్న సన్మాన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 38 సంవత్సరాల పాటు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంకి రవిందర్,సంజీవ్, టీచర్ల సంఘం సెడ్రాక్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగుట్ట డివిజన్ అభివృద్ధికి కృషి: లింగాని

శాస్త్రి నగర్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న లింగాని శ్రీనివాస్ తదితరులు

అడ్డగుట్ట,జనవరి 31 ప్రభాతవార్త: అడ్డగుట్ట డివిజన్‌లోని వివిధ ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని డివిజన్ కార్పొరేటర్,వ్యకిగత సలహాదారులు,నగర గ్రంథాలయ మాజీ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్ తెలిపారు. శనివారం శాస్త్రి నగర్, వెంకట్ నగర్ ప్రాంతాల్లో జిహెచ్ఎంసి, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు.అయాన ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను కార్పోరేటర్ ప్రసన్న దృష్టికి తెచ్చి సమస్యలు పరిష్కారం అయ్యే దిశగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ కాశీం,సలీమ్, బిఆర్ఎస్ నాయకులు దేవయ్య, ఇస్మయిల్, రవి, మల్లేశ్ పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో సృజనాత్మకత వెలికితీత

వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న కమలాకర్ రావు

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 31, ప్రభాతవార్త

విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయనీ శ్రీ నాగార్జున విద్యాలయ హై స్కూల్ కరస్పాండెంట్ జె. కమలాకర్ రావు పేర్కొన్నారు. మాధవరం కాలనీలోని శ్రీ నాగార్జున విద్యలయ హై స్కూల్‌లో శనివారం వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్ కమలాకర్ రావు, ప్రిన్సిపాల్ అనురాధ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమలాకర్ రావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని తెలియజేశారు. నర్సరీ నుండి మొదలుకొని పదోతరగతి వరకు విద్యార్థులు వివిధ రకాల వైజ్ఞానిక ప్రదర్శనలు పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బందితోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని వైజ్ఞానిక ప్రదర్శనలు తిలకించి విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌తో బండి రమేష్ బేటి



అధికారులతో మాట్లాడుతున్న బండి రమేష్ బేటి

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 31, ప్రభాతవార్త

టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను మూసాపేట్‌లోని కార్యాలయంలో కలిశారు. నియోజకవర్గ అభివృద్ధి పనులపై రమేష్ ఆయనతో సుదీర్ఘంగా చర్చించారు. రూ 10 కోట్లతో నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు జిహెచ్ఎంసి ఆమోదించింది. ఈ మేరకు పలు డివిజన్లలో చేపట్టాల్సిన పనులను జనరల్ కమిషనర్‌కు రమేష్ వివరించారు. జోనల్ కార్యాలయం నుంచి మూసాపేట చౌరస్తా వరకు రహదారి విస్తరణ పనులు త్వరలో ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఇల్లు స్థలాలు కోల్పోయే వారికి జిహెచ్ఎంసి నుంచి నష్టపరిహారాన్ని త్వరలోనే అందించనున్నట్టు వారు తెలిపారు. భరత్ నగర్‌లో నిర్మించనున్న మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ ఆంజనేయ నగర్ గోపాల్ నగర్ ఆరవ ప్లేస్ పార్కుల్లో అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభించనున్నట్లు రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే,కార్పొరేటర్ విఫలం

అత్తాపూర్ జనవరి31,ప్రభాతవార్త : ప్రజా సమస్యలను పరిష్కరించడంలో స్థానిక ఎమ్మెల్యే,కార్పొరేటర్ పూర్తిగా విఫలమైయ్యారని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ పేర్కొన్నారు.శనివారం ఉమ్మడి మైలార్‌దేవ్ పల్లి డివిజన్లో రెండో విడత శుభోదయం కార్యక్రమంలో భాగంగా డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ ఆధ్వర్యంలో బృందావన్ కాలనీ పరిసర ప్రాంతాలలో పర్యటించారు.ఈ సందర్భంగా ఆయా కాలనీలో బస్తీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొన్నారు.ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ...స్థానిక ఎమ్మెల్యే కార్పొరేటర్ నివాసలకు కూత వేటు దూరంలో ఉన్న బస్తీలు దుస్థితి ఆగామ్య గోచరంగా ఉన్నదని,నిత్యం మురుగు నీటితో కృష్ణ గోదావరి నదిలాగా పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు.ప్రజాసమస్యలను పట్టించుకోవాల్సిన ఎమ్మెల్యే, కార్పొరేటర్ సమస్యలను గాలివదిలేశారని అన్నారు. కార్యక్రమంలో కోలన్ సుభాష్ రెడ్డి, పోయిల జీవన్ దాస్,రాము యాదవ్,యూత్ అధ్యక్షులు రఘు యాదవ్, రాజేష్ యాదవ్,ఎడ్లకాడి సూర్యం, గుమ్మడి కుమార్, సునీల్, ఆర్ కుమార్, బాలరాజు యాదవ్, అశోక్,చంద్ర శేఖర్, గౌతమ్,అనిల్, చికెన్ రాజు, జి రాజు, వెంకట రమణ, సంఘం సతీష్, సలీం భాయ్, అరుణ రెడ్డి, ప్రసన్న, సుగుణమ్మ, పద్మ, పుష్పమ్మ, గోపాల్ నాయక్ , సురేందర్ యాదవ్, లోకేష్, ప్రవీణ్ సన్నీ , పోతరాజు రమేష్, నరేష్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్క్ స్థలం కబ్జాపై హైడ్రాకు ఫిర్యాదు.. ఫెన్సింగ్ ఏర్పాటు

నిజాంపేట్, జనవరి 31, ప్రభాతవార్త

నిజాంపేట్ బృందావన్ కాలనీలోని 20 గుంటల పార్క్ స్థలాన్ని కొందరు కబ్జా చేయగా, కాలనీ వాసులు ఐక్యంగా పోరాటం చేసి ఈడీ సర్వే నిర్వహింపజేసి, నివేదిక ఆధారంగా హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారులు శనివారం పార్క్ స్థలాన్ని కాపాడి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అయితే, ఆ తరువాత పార్క్ అభివృద్ధి చేసి మౌలిక వసతులు కల్పించాలంటూ ప్రస్తుత డిప్యూటీ కమిషనర్‌కు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు స్పందించలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పార్కులను అభివృద్ధి చేయడంలోనూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలోనూ అధికారుల నిరక్ష్య వైఖరికి నిరసనగా కాలనీ వాసులు స్వచ్ఛందంగా శ్రమదానం నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు పార్కులను కాపాడడమే కాకుండా వాటి అభివృద్ధి బాధ్యతను కూడా నిర్వర్తించాలంటూ కాలనీ వాసులు డిమాండ్ చేశారు. అధికారుల నిరక్ష్యాన్ని ప్రశ్నిస్తూ, పార్క్ అభివృద్ధికి తమ శ్రమదానంతో నిరసన తెలపడం గమనార్హం. ఈ కార్యక్రమంలో ఆకుల సతీష్, కాలనీ అధ్యక్షులు చంద్రశేఖర్, మురళీధర్, ఐఎన్‌వీ సత్యనారాయణ, ఎస్. కామేశ్వర రావు, కొండల్ రావు, జీవన్, రంజాన్, శ్రీనివాస్ బామ్మిడి, సతీష్ కట్ట, ఎన్. రవికిరణ్, వేణుగోపాల్ రెడ్డి, వి. తిరుపతి, వి. సాగర్, టీ. చంద్రశేఖర్, ఎన్. సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిరక్ష్య వైఖరికి నిరసనగా స్వచ్ఛందంగా శ్రమదానం చేస్తున్న కాలనీ వాసులు

మారుతున్న కాలానికి అనుగుణంగా పబ్లిక్ రిలేషన్స్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు

చిక్కడపల్లి జనవరి 31 (ప్రభాతవార్త) : మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిజం, పబ్లిక్ రిలేషన్స్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అజిత్ పాఠక్ అన్నారు. శనివారం బాగ్ లింగంపల్లి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళాశాల , పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో నలంద స్టూడెంట్ ఫోరం యూత్ ఫెస్టివల్ 2026 కార్యక్రమాన్ని ఘనంగా జరిగింది. "నావిగేటింగ్ ది ఎథిక్స్ అండ్ ఇంపాక్ట్ ఆఫ్ ది మోడ్రన్ జర్నలిజం అండ్ పబ్లిక్ రిలేషన్స్" అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా డాక్టర్ అజిత్ పాఠక్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావం పెరుగుతున్న తరుణంలో, విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే జర్నలిజం విలువలను, నైతికతను కాపాడాలని పిలుపునిచ్చారు. కాకా వెంకటస్వామి స్థాపించిన ఈ విద్యాసంస్థలో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మట్టా శేఖర్ మరియు డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, వృత్తిపరమైన బాధ్యతలను ఎలా నిర్వహించాలో విలువైన సూచనలు చేశారు. వివిధ కళాశాలల నుండి పెద్ద సంఖ్యలో హాజరైన విద్యార్థులకు చివరగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, పి ఆర్ ఎస్ ఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాగ్ లింగంపల్లి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళాశాలలో జరిగిన నలంద స్టూడెంట్ ఫోరం యూత్ ఫెస్టివల్ 2026లో పాల్గొన్న పి ఆర్ ఎస్ ఐ అధ్యక్షుడు డాక్టర్ అజిత్ పాఠక్ తదితరులు

విద్యార్థులకు బంగారు బాటలు వేసిన గౌసుద్దీన్ : జంపన

హెచ్ఎం గౌసద్దీన్‌ను సన్మానిస్తున్న జంపనప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్,జనవరి 31 ప్రభాతవార్త: బోయిన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో ఇన్‌ఛార్జి హెచ్ఎంగా పనిచేస్తున్న గౌసద్దీన్ శనివారం పదవీ విరమణ చేశారు. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ పాల్గొని ఆయనకు శాలువకప్పి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా జంపన మాట్లాడుతూ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్ది వారి జీవితానికి బంగారు బాటలు వేసి ఉత్తమ టీచర్‌గా సేవలు అందించాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీచర్లు, మంజూల, చాముండేశ్వరీ, నాయకులు షకీబ్,హుస్సెన్, రాజు, మధు,నర్సింహ్మలు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో పౌర హక్కుల దినోత్సవం

పౌర హక్కుల గురించి వివరిస్తున్న బండ్లగూడ తహశీల్దార్ ప్రవీణ్ కుమార్

చాంద్రాయణగుట్ట, జనవరి 31, ప్రభాతవార్త : పాతబస్తీ బండ్లగూడ మండల కార్యాలయ ఆధ్వర్యంలో శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఫలక్‌నుమా గాంధీనగర్‌లో జరిగిన కార్యక్రమానికి తహశీల్దార్ కె.ప్రవీణ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ రాజ్యాంగ పరంగా ప్రతి ఒక్కరికి స్వేచ్ఛగా జీవించే హక్కు ఉందన్నారు. ఎవరైనా పౌరుల స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ మండల డిప్యూటీ తహశీల్దార్ నాగరాజు,గ్రామ పరిపాలనాధికారి చంద్రయ్య, రెవెన్యూ ఇన్స్పెక్టర్ మోహన్,రషీద్,మధుసూదన్‌రెడ్డి, రికార్డు అసిస్టెంట్ పెంటయ్య,గాంధీనగర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఫలక్‌నుమా పీఎస్‌ను సందర్శించిన ట్రైనీ ఐపిఎస్‌లు

: ట్రైనీ ఐపిఎస్‌లకు స్టేషన్ పరిధిపై అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య

చాంద్రాయణగుట్ట, జనవరి 31, ప్రభాతవార్త : పాతబస్తీ ఫలక్‌నుమా పోలీసుస్టేషన్‌ను ముగ్గురు ట్రైనీ ఐపిఎస్‌లు శనివారం సందర్శించారు. ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య ట్రైనీ ఐపిఎస్‌లు భారత్ సి యారమ్, చౌదర్ అభిజీత్ రామ్‌దాస్, గులామ్ మాయాదిన్‌లకు స్టేషన్ పనితీరును వివరించారు. స్టేషన్లో ఎఫ్ఐఆర్ నమోదు చేసే విధానం నుండి కేసు దర్యాప్తు వరకు ప్రతి దశను తెలియజేశారు. కేసులను ఛేదించటంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, సీసీటీవీ ఫుటేజీల విశ్లేషనను ప్రత్యక్షంగా విడమరిచారు. ట్రైనీ ఐపిఎస్‌ల సందేహాలను నివృత్తి చేశారు. స్టేషన్ పరిధిలో శాంతిభద్రల పరిరక్షణకు అవసరమైన పెట్రోలింగ్, బీట్ వ్యవస్థ తోపాటు పలు విషయాలను వారితో చర్చించారు. ప్రజలతో స్నేహ పూర్వక పోలీసింగ్ (ఫ్రెండ్లీ) గురించి సిబ్బంది ప్రయోగాత్మకంగా పేర్కొన్నారు. అనంతరం స్టేషన్‌లో నమోదైన పాత రౌడీషీటర్ల వివరాలు, పెండింగ్‌లో ఉన్న కేసుల రికార్డులను వారు క్షుణ్ణంగా పరిశీలించారు.

విద్యారంగ అభివృద్ధితోనే వికసిత్ భారత్ సాధ్యం : హరగోపాల్

యాకుత్‌పుర,జనవరి 31 ప్రభాతవార్త : విద్యారంగ అభివృద్ధితోనే వికసిత్ భారత్ సాధ్యమని సామాజిక శాస్త్రవేత్త,ఆచార్య హర గోపాల్ అన్నారు.ప్రభుత్వ సిటీ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం,ఎన్ఎస్ఎస్ యూనిట్లు సంయుక్తంగా ట్రాన్స్‌ఫర్మేషన్ ఇండియా- సామాజిక సేవలపై అవగాహన,వికసిత భారత్ 2047 సాధనలో ఎన్ఎస్ఎస్ వ్యూహాత్మక పాత్ర అన్న అంశంపై రెండు పాటు నిర్వహించిన జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి తగిన బడ్జెట్ కేటాయింపులు చేయక పోతే వికసిత్ భారత్ అనే స్వప్నం సాకారం కాదని తెలిపారు.దేశంలోని ప్రతీ పౌరునికి నాణ్యమైన విద్య అందించడంతో పాటు అత్యుత్తమ పాఠ్య ప్రణాళికలు,ఉన్నత స్థాయి పరిశోధనలకు ప్రధాన్యం ఇచ్చినప్పుడే భారత దేశం అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చెందిన దేశంగా నిలుస్తుందని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ డా.ఎల్ తిరుపతి,సిటీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.విప్లవ దత్ శుక్లా,డా.పి.శాంతి,మాను విశ్వ విద్యాలయం ఆచార్యులు నాగేశ్వరరావు,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డా.కృష్ణ చంద్ర కీర్తి,డావి.శ్రీదేవి,డా.సుదక్షణ,ఎన్‌సిసి అధికారి డా.కృష్ణవేణితో పాటు పలువురు పాల్గొన్నారు.

నల్లగుట్టలో 25వ శివపూజ మహోత్సవానికి ఏర్పాట్లు

పేట్ బషీరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం నల్లగుట్టలోని శ్రీ భ్రమరాంభ మల్లికార్జున దేవస్థానంలో ద్వాదశ జ్యోతిర్లింగ 25వ శివపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేపట్టింది. ఫిబ్రవరి 1వ తేదీన ఉదయం 10 గంటల నుంచి రుద్ర హోమం, శివపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.అలాగే ఫిబ్రవరి 15వ తేదీన మహాశివరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ పూజా కార్యక్రమాలు ప్రధాన గురుస్వామి శివశ్రీ దూదిమెట్ల సోమేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరుగనున్నాయి. ఈ సందర్భంగా శివ స్వాములు, శివ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి పూజలను తిలకించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించి పరమేశ్వరుని అనుగ్రహం పొందాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమాల్లో గురుశివులు రాజారావు, పెంటయ్య, యాదిలాల్, సురేష్ రెడ్డి, కృష్ణారెడ్డి, లెవీర్ గురుశివులు పాల్గొననున్నారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ శివశ్రీ దూదిమెట్ల సోమేష్ యాదవ్ భక్తులకు ఆహ్వానం పలికారు.

బాచుపల్లి గ్రామంలో ప్రభుత్వ భూమికి కంచె ఏర్పాటు

నిజాంపేట్, జనవరి 31, ప్రభాతవార్త

బాచుపల్లి గ్రామం, మండల పరిధిలోని సర్వే నంబర్ 301లో ఉన్న 33 గుంటల విస్తీర్ణంలో ప్రభుత్వం భూమికి హైడ్రా అధికారులు శనివారం కంచె ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిని కాపాడే చర్యల్లో భాగంగా ఈ ప్రక్రియను చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైడ్రా సీఐ నరేష్, సర్వేయర్ సింధు లక్ష్మి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు భాను చందర్, మల్లేశ్వర్ రావుతో పాటు హైడ్రా బృందం, రెవెన్యూ బృందం సభ్యులు పాల్గొన్నారు. సర్వే చేసి హద్దులు నిర్ధారించిన అనంతరం భూమికి కంచె ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ భూముల కబ్జాలను అరికట్టేందుకు ఇలాంటి చర్యలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

డిజిటల్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఇన్‌స్పెక్టర్ రామయ్య

డిజిటల్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఇన్ స్పెక్టర్ రామయ్య.

మెహిదీపట్నం, జనవరి 31, ప్రభాతవార్త : డిజిటల్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండడంతోపాటు, మోసపోయామని తెలిసిన వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారం అందిస్తే నిందితులను పట్టుకోవడానికి వీలుంటుందని గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ రామయ్య అన్నారు. టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ డిజిటల్ మోసాలు ఎక్కువగా అవుతున్నాయని, వాటిని నివారించాలంటే ప్రజలకు అవగాహన తప్పనిసరి అన్నారు. శనివారం గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలకు డిజిటల్ మోసాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇన్ స్పెక్టర్ రామయ్య హాజరై మాట్లాడారు.. నేడు డిజిటల్ మోసాలు ఎక్కువ అవుతుండడం ఆవేదన కలిగించే విషయమన్నారు. ఎక్కువగా ఆన్ లైన్ వచ్చే కాల్స్, ఓటిపి మోసాలు, నకిలీ లింకులు, అనుమానాస్పద సందేశాలు వంటి సైబర్ నేరాలపై మరి ముఖ్యంగా జాగ్రత్తగా ఉండాలన్నారు. వ్యక్తిగత సమాచారం తోపాటు బ్యాంకింగ్ వివరాలను ఎవరితోనూ పంచుకోకూడదని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షులు బిజ్జా దుర్గాప్రసాద్, నగర యూత్ కాంగ్రెస్ నాయకులు సంతోష్ గౌడ్, బుడగజంగం బస్తీ వాసులు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు మోడీ ప్రభుత్వం పెద్దపీట : డాక్టర్ లక్ష్మణ్

చిక్కడపల్లి జనవరి 31 (ప్రభాతవార్త) : లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ ఆధ్వర్యంలో వారి ఆధ్వర్యంలో సామజిక సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న 82 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ లను అందచేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన కె. లక్ష్మణ్ కుట్టు మిషన్ లను గాంధీనగర్ , కార్పొరేటర్ డివిజన్ కార్పొరేటర్లు ఎ.పావని వినయ్ కుమార్ ,రచన శ్రీ లతో కలిసి పంపిణి చేసారు. డాక్టర్ల లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ మహిళా సాధికారతకు పెద్ద పీట వేశారని, అందుకు అనుగుణంగా మహిళల కు స్వయం ఉపాధి కల్పించే విధంగా ఉచితంగా కుట్టు,ఎంబ్రాయిడరీ,బ్యూటీషన్ కోర్సు ల్లో ఉచిత శిక్షణ అందిస్తూ,మహిళలు స్వతహాగా ఆర్థిక అభివృద్ధి చెందేందుకు సహాయకరంగా ఉపాధి కొరకు లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గంపా నాగేశ్వర్ రావు, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు అశోక్ కుమార్ స్వేని, లింగారెడ్డి,చైర్ పర్సన్స్ టి.టి రెడ్డి, ఎం. ఏస్. ప్రకాష్,అధ్యక్షులు చేంద్ర మోహన్,సుమన్,విజేందర్ రెడ్డి, కాసం శ్రీనివాస్,కమలాకర్,సెరిపల్లి గణేష్,హేమంత కుమార్, కల్లూరి శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం,ప్రవీణ్,మధు, భాగ్య లక్ష్మి , బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ ,సీనియర్ బీజేపీ నాయకులు వి.నవీన్ కుమార్, వెంకటేష్, రత్న సాయి చంద్,శ్రీకాంత్,దామోదర్,పీ.నర్సింగ్ రావు, సురేష్ రాజు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్‌లను పంపిణి చేస్తున్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె .లక్ష్మణ్, చిత్రంలో గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

త్యాగరాయ గానసభలో గద్దర్ యాదిలో..

చిక్కడపల్లి జనవరి 31 (ప్రభాతవార్త) : చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని లలిత కళా వేదిక పై త్యాగరాయ గానసభ నిర్వాహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా గద్దర్ యాదిలో పేరిట జయంతి సభ గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళా వి .ఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సి బి ఐ న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగ మారుతి శర్మ పాల్గొని మాట్లాడుతూ ప్రజలను తన ఆట పాట తో చైతన్య పరిచిన గద్దర్ ఆశయాలను నిజం చేయవలసిన అవసరం ఉందని అన్నారు ఆయన జీవితాంతం బడుగు బలహీన వర్గాల ప్రజల శ్రేయస్సు కె కృషి చేశారు అని చెప్పారు గద్దర్ తెలంగాణ రాష్ట్ర సాధనకు తన వంతు పాత్ర పోషించారు అని ఆయన ఆశించిన సామాజిక తెలంగాణ కార్యరూపం లోకి రావాలి అని సూచించారు గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదికపై సంఘ సేవకుడు భవాని శ్రీనివాస్ గాయకుడు ప్రశాంత్ ఆంజనేయులు కృష్ణ జవహర్ పాల్గొన్నారు.

త్యాగరాయగానసభలో జరిగిన గద్దర్ యాదిలో సభలో ప్రసంగిస్తున్న

శాంతిని పెంపొందించటానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి : డిపిసి ఖారే కిరణ్

చార్మినార్,జనవరి 31 ప్రభాతవార్త : రానున్న పండుగలను ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలు జరుపుకోవటానికి,నగరంలో శాంతి భద్రతలను కాపాడటానికి శనివారం పాతబస్తీలోని సంజరీ కన్వెన్షన్‌లో చార్మినార్ జోన్ డిసిపి ఖారే కిరణ్ సెంట్రల్ పీస్ కమిటి సభ్యులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డిసిపి ఖారే కిరణ్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో శాంతిని పెంపొందించడానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరిస్తామని పీస్ కమిటి ప్రతినిధులు హామి ఇచ్చారు.అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండ ముందుస్తు చర్యలు చేపట్టాలని ఆయన పోలీస్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో చార్మినార్ జోన్ అదనపు డిసిపి ఎంఎ మాజిద్,ఆల్ జోన్స్ సెక్రటరీ శ్రీకిషన్ శర్మ,చార్మినార్ జోన్ ప్రెసిడెంట్ కె.ఏ.మొయిజ్,ప్రధాన కార్యదర్శి డాక్టర్ జైన్,పేట్రన్ హఫీజ్ ముజాఫర్ హుస్సేన్,కోశాధికారి నర్సింహ్మా గౌడ్‌తో పాటు పలువురు పోలీస్ అధికారులు,పీస్ కమిటి ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చార్మినార్ జోన్ డ

వెంకటరమణ కాలనీలో సమస్యలు పరిష్కరిస్తా : రాగుల

సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ రాగుల

వనస్థలిపురం. జనవరి.31.ప్రభాతవార్త

వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర రెడ్డి వనస్థలిపురం డివిజన్ పరిధిలోని వెంకటరమణ కాలనీని సందర్శించారు.ఈ సందర్భంగా కాలనీలో నివసిస్తున్న ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లపై నీరు నిలిచిపోవడం వల్ల ఏర్పడుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా పరిశీలించారు. వర్షాలు పడినప్పుడు రోడ్లపై నీరు నిల్వ ఉండటం వల్ల రాకపోకలకు ఆటంకం కలగడంతో పాటు, దోమల పెరుగుదల మరియు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు కార్పొరేటర్‌కి వివరించారు.ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న కార్పొరేటర్ , సంబంధిత అధికారులతో మాట్లాడి నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకురావడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డ్ ఇన్సూరెన్స్‌ని సద్వినియోగం చేసుకోవాలి : విజయభాస్కర్ రెడ్డి

ఏపీఎ యు కాలనీలో ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డ్ ఇన్సూరెన్స్ క్యాంపును నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆఫ్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ మడిగెల విజయభాస్కర్ రెడ్డి తదితరులు

మలక్ పేట, జనవరి 31, ప్రభాతవార్త:

ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డ్ ఇన్సూరెన్స్ ని సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆఫ్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ మడిగెల విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఆస్మాన్ ఘాట్ డివిజన్ ఏపీఎయు కాలనీ పార్కులో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆఫ్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ మడిగెల విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డ్ ఇన్సూరెన్స్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాల వయసు పైబడిన ప్రతి ఒక్కరు ఇ పథకానికి అర్హులని, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డ్ ఇన్సూరెన్స్ ను తీసుకున్న వారికి రూ. ఐదు లక్షల వరకు ఉచిత మెడికల్ ఇన్సూరెన్స్ కవరేజ్ లభిస్తుందని వివరించారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు ఇన్సూరెన్స్ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డన్నారం పట్టణ ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్ఏ జయమ్మ, ఆశ వర్కర్లు అనురాధ, ధనలక్ష్మి, కవిత, చంద్రకళ , అనూష తదితరులు పాల్గొన్నారు.

మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డికి సన్మానం

పిజ్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డిని సన్మానిస్తున్న ముథోల్ బిఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు

మేడిపల్లి, జనవరి 31 ప్రభాతవార్త ;

తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ముథోల్ నియోజకవర్గం భైంసా మున్సిపాలిటీకి ఇన్చార్జిగా బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డిని నియమించిన సందర్భంగా, ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు డా. కిరణ్ కొమ్రేవార్, మాజీ జడ్పీ చైర్మన్ లోలం శ్యామ్ సుందర్, కోర్వ శ్యామ్ తదితరులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిర్జాదిగూడ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, పింగళి జోగిరెడ్డి, ఆంజనేయులు, శ్యామల శ్రీనివాస్, శేఖర్, రామకృష్ణ, రమేష్ పాల్గొన్నారు

పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివి : కార్పొరేటర్

చేస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్, జనవరి 31 ప్రభాతవార్త:

పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. జిఏ2 కాలనీలో స్థానిక కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిహెచ్ఎంసి స్వీపర్లకు కార్పొరేటర్ చేతుల మీదుగా నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మనం నిద్ర లేవడానికంటే ముందే స్వీపర్లు తమ విధి నిర్వాహణలో నిమగ్నమవుతారని అన్నారు. వారి సేవలు వెలకట్టలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కృష్ణ, మురళి, రమణ మూర్తి, ఎస్ఎఫ్ఏ సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్‌ని కలిసిన కార్పొరేటర్లు

కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్లు పన్నాల దేవేందర్ రెడ్డి, శాంతి సాయిజన్ శేఖర్

నాచారం, జనవరి 31 ప్రభాతవార్త : మల్లాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో సిసి రోడ్ల కొరకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ శనివారం జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి. కర్ణన్ మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, నాచారం కార్పొరేటర్ శాంతి జెన్ శేఖర్ కలిసి వినతి పత్రం అందజేశారు.ముఖ్యంగా ఓల్డ్ మల్లాపూర్ మల్లికార్జున నగర్,కాలనీ భవాని నగర్,న్యూ భవాని నగర్, ఎస్వీ నగర్, ఫేస్ 3, అన్నపూర్ణ కాలనీలలో సిసి రోడ్ల కొరకు తక్షణమే నిధులు మంజూరు చేయాలని ఆయన కమిషనర్ ని కోరారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి తెలిపారు. అదేవిదంగా నాచారం డివిజన్‌కు సంభందించి నిధులు కెటాయించాలని కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ వేర్వేరుగా వినతులు అందజేశారు.

ఓసీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి : లక్ష్మీనారాయణ గుప్త

-ఓసిల హక్కుల సాధనకై చలో ఢిల్లీ
-సన్నాహక సభ పోస్టర్ ఆవిష్కరణ

మలక్ పేట్, జనవరి 31, ప్రభాతవార్త:

ఓసీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, ఫిబ్రవరి 23వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఓసీల హక్కుల సాధనకై చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఓసీ జేఏసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ గుప్త పిలుపునిచ్చారు. శనివారము ముసారాంబాగ్‌లోని హైదరాబాద్ , రంగారెడ్డి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వివిధ కుల సంఘాల నాయకులతో ఓసి జెఎసి ఆధ్వర్యంలో సన్నాహాక సభ , పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ గుప్త మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి ఆర్యవైశ్య సంఘాల నాయకులు ఫిబ్రవరి 23న జరిగే జంతర్ మంతర్ నిరసన సభకు పెద్ద ఎత్తున కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఓసి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుబ్బ శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించినటువంటి ఓసి జేఏసీ పక్షాన 12 డిమాండ్ల పరిష్కారానికి నిరసన కార్యక్రమానికి అన్ని కుల సంఘాల నాయకులతో కలిసి విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఓసి జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తాడిశెట్టి పశుపతి గుప్త మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న అగ్రకుల సామాజిక వర్గాలలోని పేద విద్యార్థిని, విద్యార్థులు, రైతులు, మహిళలకు, విద్య ఉద్యోగ ఉపాధి రాజకీయ విషయాలలో జరుగుతున్న అన్యాయాన్ని పరిష్కరించుకునే దిశగా అన్ని వర్గాల ప్రజల పక్షాన దేశం నడిబొడ్డున జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని, నిరసన కార్యక్రమం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కనువిప్పు కలిగే విధంగా ఉంటుందని తెలియజేశారు. ఈడబ్ల్యూ

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఓసీ జేఏసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ గుప్త, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుబ్బ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ తాడిశెట్టి పశుపతి గుప్త, నాయకులు రాముని రామనాథం, పసునూరి శ్రీనివాస్, ఏవి రావు తదితరులు

ఎస్ జాతీయ స్థాయి కమిషన్ ను ఏర్పాటు చేయాలని, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ జారీకి షరతులు లేని 5 సంవత్సరాల కాలపరిమితి కలిగి ఉండాలని, ఆదాయపరిమితి రూ.10 లక్షల వరకు పెంచాలని, విద్య, ఉద్యోగ పోటీ పరీక్షల వయోపరిమితిని పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు ఈడబ్ల్యూఎస్ వర్గాలకు అమలు చేయాలని, అన్ని సామాజిక వర్గాలకు క్రిమిలేయర్ విధానాన్ని అమలు చేయాలని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అన్ని రాష్ట్రాలలో సంపూర్ణంగా అమలు చేయాలని, ప్రస్తుతం 50 పెంచకుండా ఓసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతు పండించిన పంటలకు రైతే ధర నిర్ణయించేందుకు చట్టం తేవాలని, రైతులకు రైతు బీమా వయోపరిమితిని 70 సంవత్సరాల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఓసి జెఏసి రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్లు దాచేపల్లి సీతారాం, అల్లాడి వీరభద్రయ్య, రాష్ట్ర కోఆర్డినేటర్ పొద్దుటూరి వేణు, ఓసి జేఏసీ రాష్ట్ర నాయకులు రాముని రామనాథం, పసునూరి శ్రీనివాస్, కోటగిరి మహేష్, ఏవి రావు, గుడు గుండ్ల మహేష్ గుప్తా లతో పాటు పలువురు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యువత పట్టుదలతో తమ లక్ష్యసాధన కోసం కృషి చేయాలి : డిసిపి మధుకర్ స్వామి

మలక్ పేట, జనవరి 31, ప్రభాతవార్త:

యువత పట్టుదల, క్రమశిక్షణ, అంకితభావంతో తమ లక్ష్య సాధన కోసం కృషి చేయాలని అంబర్ పేట, మేడ్చల్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్, డిసిపి, పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఫౌండర్ మధుకర్ స్వామి పేర్కొన్నారు. ముసారాంబాగ్ లోని శ్రీధర్స్ సీసీఇ క్యాంపస్ లో పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్, శ్రీధర్స్ కాలేజ్ ఫర్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్, రామ్ కి ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ గ్రీన్ ఫీల్డ్ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్ఎస్సిజిడి, ఆర్ఆర్బీ, గ్రూప్ 3 విభాగాలలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు సక్సెస్ మీట్ నిర్వహించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఫౌండర్ మధుకర్ స్వామి రామ్ కీ ఫౌండేషన్ ప్రెసిడెంట్ రామిరెడ్డి, శ్రీధర్ సిసిఈ డైరెక్టర్ సుధీర్, సంతోష్ రెడ్డి, లయన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీ కుమారి తదితరులు మాట్లాడుతూ చాలా కష్టాలను ఎదుర్కొని, పట్టుదలతో చదువుకుని విజయాలను సాధించారని విద్యార్థులను అభినందించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా పేద విద్యార్థులకు తమ వంతు సహాయ కార్యక్రమాలను అందిస్తున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న డీసీపీ మధుకర్ స్వామి, రామ్ కి ఫౌండేషన్ అధ్యక్షులు రామి రెడ్డి, సుధీర్, సంతోష్ రెడ్డి తదితరులు

పై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని వివరించారు. సుమారు 68 విద్యార్థులు సెంట్రల్ పారామీటర్ ఫోర్సెస్, అసిస్టెంట్ లోకో పైలట్, గ్రూప్ 3 విభాగాలలో ఉద్యోగాలను సాధించారని తెలియజేశారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు తమ సంస్థల ఆధ్వర్యంలో ఉచితంగా రెసిడెన్షియల్ కోచింగ్ ను అందిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ జనరల్ సెక్రెటరీ సందీప్ హరి, జి.భాస్కర్ స్వరణ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రూ.2.2 కోట్ల ప్రతిభా పురస్కారాలు

-చదువుకో తెలంగాణ - శ్రీరామ్ లైఫ్ మిషన్ 10వ క్లాస్ ప్రారంభం

తార్నాక, జనవరి 31 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో"చదువుకో తెలంగాణ - శ్రీరామ్ లైఫ్ మిషన్ 10వ క్లాస్మ్ అనే మెగా ప్రతిభా పురస్కారాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. భారతదేశంలోనే ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం చేపడుతున్న అతిపెద్ద ప్రోత్సాహక కార్యక్రమంగా ఇది నిలవనుంది. ఈ కార్యక్రమానికి సంబంధించి రూపొందించిన వాల్ పోస్టర్‌ను ప్రముఖ సామాజికవేత్త, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం శనివారం తార్నాక లోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ పథకం ద్వారా మొత్తం రూ. 2.2 కోట్ల వరకు నగదు ప్రోత్సాహకాలు అందజేయనున్నారు. రాష్ట్ర స్థాయి ప్రభుత్వ పాఠశాల టాపర్‌కు రూ.5 లక్షలు, రెండో టాపర్‌కు రూ.3 లక్షలు, ప్రతి జిల్లా టాపర్‌కు రూ.2 లక్షలు, ప్రతి నియోజకవర్గ టాపర్‌కు రూ.1 లక్ష, ప్రతి మండల టాపర్‌కు రూ.10,000 నగదు బహుమతులు అందిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా పరిషత్, మండల పరిషత్, ఇతర ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న 6,000

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్నన ఎమ్మెల్సీ ప్రొ.కొదండరాం

కు పైగా ప్రభుత్వ పాఠశాలల్లోని సుమారు 3.30 లక్షల మంది 10వ తరగతి విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉంది. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడటానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వచ్చే రెండు నెలలు విద్యార్థులు కష్టపడి చదివి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ చిట్స్ హైదరాబాద్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జె. భాస్కర్, డీజీఎంలు ఎన్. మురళి, కె. రాజశేఖర్, ఎల్. వెంకట కృష్ణ, డివిజనల్ మేనేజర్ పీ. సతీష్, సీనియర్ డెవలప్ మెంట్ ఆఫీసర్ ఎస్. జస్వంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైదాబాద్ ఎల్‌సిహెచ్ కాలనీలో బిటి రోడ్ల నిర్మాణంలో లోపాలు

-సరిగ్గా వేయకపోవడంతో రోడ్లపై నిలుస్తున్న నీరు
-రోడ్లు త్వరగా పాడవుతాయని స్థానికుల ఆందోళన

రోడ్డు సక్రమంగా వేయకపోవడంతో గుంతగా మారి ఇళ్ళ ముందు నీరు నిలిచిన దృశ్యం

సైదాబాద్, జనవరి 31 ప్రభాతవార్త: మలక్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గంలోని సైదాబాద్ ఎల్‌సిహెచ్ కాలనీలో బిటి రోడ్ల నిర్మాణాలు లోపభూయిష్టంగా మారాయి. సంబంధిత జిహెచ్ఎంసి అధికారుల పర్యవేక్షణా లోపం వల్ల కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా చేసిన రోడ్ల నిర్మాణం విమర్శలకు దారి తీసాయి. స్థానిక ఎల్‌సిహెచ్ కాలనీ బృందావన్ పార్కు వద్ద మూడు వీధుల్లో లక్షలాది రూపాయల వ్యయంతో గత శుక్రవారం సింగిల్ లేయర్ బిటి రోడ్ల నిర్మాణం జరిపారు. మధ్యాహ్న సమయంలో పనులు మొదలు పెట్టిన కాంట్రాక్టర్ హడావిడిగా పనులు జరిపి సాయంత్రానికి ముగించారు. దీంతో రోడ్డు నిర్మాణ లోపాలు స్పష్టంగా కనిపించాయి. రోడ్ల నిర్మాణాల్లో కనీస ప్రమాణాలు పాటించకపోవడంతో కొన్ని చోట్ల బిటి రోడ్డు గుంతగా తయారై నీరు నిలిచే

బిటి రోడ్డు నిర్మాణ లోపాలను ఎత్తి చూపుతున్న నడి రోడ్డుపై నిలిచిన నీరు

విధంగా అయ్యాయి. రోడ్డు నిర్మాణాలకు కావాల్సిన బిటి మెటీరియల్ సరిపడనంత తేలేకపోవడంతో చాలా సేపు పనులు నిలిచిపోయాయి. రోలర్‌ను నడిపే డ్రైవర్ సైతం ఇష్టారాజ్యంగా హడావిడిగా చేయడంతో రోడ్లపై సరైన స్లోపులు రాకపోవడంతో కొన్ని చోట్ల నిలిచే పరిస్థితి కలిగింది. కాలనీకి ప్రధాన రోడ్డు అయిన బృందావన్ పార్కు ముందు ఉన్న లైన్‌లో గతంలో మాదిరిగానే రోడ్డుపై నీరు నిలవడం అదే విధంగా ఇళ్ళ ముందు సైతం నీరు నిలవడంతో రోడ్డు నిర్మాణ లోపాలు స్పష్టంగా కనిపించాయి. రోడ్డు నిర్మాణపు పనులను పర్యవేక్షించాల్సిన అధికారుల బాధ్యతారాహిత్యం.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా రోడ్డు నిర్మాణాలు సక్రమంగా జరగలేదనేది రోడ్లపై నిలిచిన నీరును పరిశీలిస్తే స్పష్టమవుతుంది. ఇలా నీరు నిలిస్తే బిటి రోడ్లు కొద్ది నెలల్లోనే శిథిలమవుతాయని స్థానికులు పేర్కొంటున్నారు.

జిల్లా క్రీడోత్సవాల్లో మెరిసిన మల్కాజిగిరి విద్యార్థులు

నేరేడ్ మెట్, జనవరి 31,ప్రభాతవార్త : జిల్లా స్థాయి యువజన క్రీడోత్సవాల్లో మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభతో మెరిశారు. మేడ్చల్ జిల్లా సిఎంఆర్ కండ్లకోయ మైదానంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి యువజన క్రీడోత్సవాలలో వివిధ క్రీడా విభాగాల్లో పోటీ పడి, బహుమతులు కైవసం చేసుకొని కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చారు.వాలీబాల్ (పురుషులు) విభాగంలో మల్కాజిగిరి కళాశాల జట్టు అద్భుత ఆటతో ప్రథమ బహుమతి సాధించగా, కబడ్డీ (మహిళలు) విభాగంలో ద్వితీయ స్థానంతో మెప్పించింది. వ్యక్తిగత విభాగాల్లో షాట్‌పుట్‌లో విజయ్ (బి.ఏ) తృతీయ బహుమతి పొందుతూ తన సామర్థ్యాన్ని చాటారు. ఈ విజయాలు జట్టు సమన్వయం, క్రమశిక్షణ, కఠిన సాధనకు నిదర్శనంగా నిలిచాయి.విజేతలకు జిల్లా యువజనాధికారి కె. ఐజయ్య చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. బండి రాజు ,క్రీడల కమిటీ సమన్వయకర్త డా. ఎడ్ల ప్రదీప్, వైస్ ప్రిన్సిపాల్ డా. పి. అడవి రాజు సహా అధ్యాపక బృందం మాట్లాడుతూ, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమని పేర్కొన్నారు.

మినీ శిల్పారామంలో భరత నాట్య ప్రదర్శనలు

ఉప్పల్ మినీ శిల్పారామంలో భరత నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు దృశ్యం.

ఉప్పల్, జనవరి 31 ప్రభాతవార్త : ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం శ్యామల శ్రీనివాస్ శిష్య బృందం ఆధ్వర్యంలో భరతనాట్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గణేశా పంచరత్న, నటేశ కౌతం, వర్ణం, విష్ణు కీర్తన, శివ కీర్తన, దుర్గ కీర్తన, జావళి, పదం, కృష్ణ కీర్తన, తిల్లాన తదితర అంశాలను కళాకారులు అనిషా, లలిత, సంయుక్త, సితార, సమైరా, వరేణ్య, శతాక్షి, తన్వి తదితరులు ప్రదర్శించి మెప్పించారు. శనివారం సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వహకులు తెలిపారు.

సిఎం సహాయనిధి పేదలకు వరం : పరమేశ్వర్‌రెడ్డి

లబ్దిదారులకు సిఎం సహాయనిధి చెక్‌లు అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్, జనవరి 30 ప్రభాతవార్త : సిఎం సహాయనిధి పథకం నిరుపేదలకు ఒక వరంలాంటిదని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ అసెంబ్లీకి చెందిన పలువురు లబ్దిదారులకు సిఎం సహాయనిధి చెక్‌లు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న పేదలు సిఎం సహాయనిధి పథకాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. అర్హులైన పేదలకు ప్రభుత్వం తగు సహకారం అందిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సిఎం రేవంత్‌రెడ్డి అర్హులందరికి సకాలంలో మెడికల్ బిల్లులు చెల్లిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన జంగయ్యకు రూ.60 వేలు, రోహితకు రూ.60 వేలు, సంధ్యకు రూ.60 వేలు, ప్రవీణ్ కుమార్‌కు రూ.60 వేలు, పి.నాగరాజుకు రూ.57 వేలు, గుమ్మడిల్లి మల్లేష్‌కు రూ.60 వేలు, జంగయ్యకు రూ.31వేలు, వెంకటేష్‌కు రూ.25 వేలు చొప్పున మంజూరైన చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్, రామంతాపూర్, మల్లాపూర్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బాకారం లక్ష్మణ్, మహమ్మద్ రఫీక్, కాప్రా సాయి గౌడ్, కాంగ్రెస్ పార్టీ నేతలు ఆకిటి ఆగంరెడ్డి, ప్రభాకర్ రెడ్డి,వెంకట్ రెడ్డి, రమణ, మదన్ గౌడ్,రాజేష్, కోమటిరెడ్డి కృష్ణారెడ్డి, గుమ్మడెల్లి కిషోర్, జంగయ్య పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమానికి కృషి : శ్రవణ్‌రెడ్డి

క్రిస్టియన్ మైనార్టీల సదస్సులో పాల్గొన్న జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కంది శ్రవణ్‌రెడ్డి తదితరులు

ఉప్పల్, జనవరి 31 ప్రభాతవార్త : క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని మేడ్చల్ జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కంది శ్రవణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం హబ్సిగూడ డివిజన్ చర్చి అసోసియేషన్, పాస్టర్లు ఆధ్వర్యంలో సిఎస్ఐ చర్చిలో క్రిస్మస్ వేడుకలతోపాటు, కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి క్రిస్టియన్ సోదరులకు రూ.లక్ష అందజేశారని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు హబ్సిగూడ వీధినెం.8లోని చర్చిలో సమావేశం నిర్వహించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం క్రిస్టియన్ మైనార్టీ సంక్షేమానికి తగు చేయూత అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయకుమార్,ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర నాయక్, ఎస్సీ సెల్ నాయకులు సల్మాన్‌బాబు, డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాసునాయక్, ఇందిరమ్మ కమిటి సభ్యులు గుండూరు జన్న, జావిద్, చర్చి అసోసియేషన్ సభ్యులు పాధర్ జితేందర్, పాస్టర్ పన్నీర్, వినోద్ కుమార్, కుమార్, సుమన్ నాయక్, శివ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, కమ్యూనిటీ హాల్, బస్తీ దవాఖాన పూర్తి చేయాలని కమిషనర్‌కు వినతి

నేరేడ్ మెట్, జనవరి 31,ప్రభాతవార్త : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం అనంతరం, వినాయక్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ కర్ణనను కలిసి తమ డివిజన్‌లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు.మురుగు నీటి సమస్య పరిష్కారంలో భాగంగా పైప్‌లైన్ ఏర్పాటు చేసిన కారణంగా దీన్‌దయాళ్‌నగర్ ప్రధాన రహదారి గుంతలతో దెబ్బతిని ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆ రహదారిపై కొత్త సిమెంట్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.అలాగే వినాయక్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్, బస్తీ దవాఖాన భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని, కాకతీయనగర్‌లోని గౌరీశంకర్ అపార్ట్‌మెంట్ల నుంచి దీన్